RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తులసి GOLD LOAN

తులసి గోల్డ్ లోన్
ఫ్రాంచైజీ ఇవ్వబడును.
మీ సొంత బిజినెస్ కు అద్భుత అవకాశం
9247758597, 9666688146

EDITOR: BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME: 18 ISSUE: 124 WEDNESDAY, OCTOBER 14, 2026 PAGES: 12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి : 18 సంచిక : 124 బుధవారం, అక్టోబర్ 14, 2026, పేజీలు : 12 వెల : 2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## ముగిసిన టీ కాంగ్రెస్ ఢిల్లీ పర్యటన
## హైదరాబాద్‌కు బయలుదేరిన సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ పత్రిక ప్రతినిధి, న్యూ ఢిల్లీ

ఢిల్లీ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. గత మూడు రోజులుగా ఏఐసీసీ పిలుపు మేరకు ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, రోహిన్ రెడ్డి రాత్రి 8 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరారు. ఆదివారం ఢిల్లీకి వెళ్లిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు ఈ పర్యటనలో పాల్గొని పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. సోమవారం ఢిల్లీలో నిరసన ర్యాలీ ముగిసిన అనంతరం నేతలు తిరిగి రావాల్సి ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు అక్కడే ఉండిపోయారు. మంగళవారం సాయంత్రం రాహుల్ గాంధీ నివాసంలో ఇండియా కూటమి నాయకుల సమావేశం ముగిసిన తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి తిరుగు ప్రయాణంపై స్పష్టత వచ్చింది. దీంతో ఢిల్లీలో ఉన్న నాయకులంతా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వివిధ విమానాల్లో హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్.!

రెండు పట్టభద్రుల స్థానాల్లో గెలుపే లక్ష్యం..

77 మంది ఇన్‌చార్జ్‌ల నియామకం

ఓటరు నమోదు నుంచి క్షేత్రస్థాయి

సమన్వయం వరకు ప్రత్యేక కార్యాచరణ



తెలంగాణ పత్రిక ప్రతినిధి, హైదరాబాద్

తెలంగాణలో రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో విజయం సాధించడమే ప్రధాన లక్ష్యంగా పార్టీ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తోంది. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఓటరు నమోదు ప్రక్రియను సమర్థంగా నిర్వహించేందుకు మొత్తం 77 మంది ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఇందులో హైదరాబాద్‌రం గారెడ్డిమహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గానికి 43 మందిని, నల్గొండవరంగల్‌ఖమ్మం నియోజకవర్గానికి 34 మందిని నియమిస్తూ కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ అత్యంత కీలకంగా మారనుంది. అర్హత కలిగిన ప్రతీ పట్టభద్రుడూ ఓటరుగా నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో విస్తృత చర్యలు చేపట్టాలని పార్టీ నాయకత్వం ఆదేశించింది. జిల్లాల వారీగా పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచి, ఓటరు నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేలా బాధ్యతలు అప్పగించింది. టిపిసిసి అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్ గౌడ్ పట్టభద్రుల ఓటరు నమోదు కోసం ప్రత్యేక పరిశీలకులను నియమించారు. ఆయా జిల్లాల్లో పార్టీ నాయకులు, సంబంధిత వర్గాలతో సమన్వయం చేసుకుంటూ ఓటరు నమోదును దిగ్విజయంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లోనూ విజయం సాధించేందుకు పార్టీ నాయకత్వం పక్కా వ్యూహరచన చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలోనూ ఎన్నికల సన్నద్ధతపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఓటరు నమోదు, క్షేత్రస్థాయి బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్యేలు లేని ప్రాంతాల్లో ఎంపీలు, ఎమ్మెల్సీలకు బాధ్యతలు అప్పగించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలందరూ పూర్తి సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం రెండు స్థానాలకే పరిమితం కాకుండా, రాష్ట్రరాజకీయాల్లోనూ విశేష ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత అభిప్రాయాలు ఈ ఎన్నికల్లో అత్యంత కీలకంగా మారనున్న నేపథ్యంలో, ఓటరు నమోదు నుంచి ప్రచారం వరకు ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. 77 మంది ఇన్‌చార్జ్‌ల నియామకంతో కార్యాచరణను వేగవంతం చేసిన కాంగ్రెస్, పట్టభద్రుల మద్దతును ఏమేరకు కూడగడుతుందనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు బీజేపీ టికెట్ కోసం తీవ్ర పోటీ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు

భారతీయ జనతా పార్టీ సమాయత్తమవుతోంది..!

తెలంగాణ పత్రిక ప్రతినిధి, హైదరాబాద్



అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టి సారించిన కమలం పార్టీ, ముందస్తు కసరత్తును వేగవంతం చేసింది. ఇప్పటికే పొలిటికల్ టికెట్ ఆశిస్తున్న ఆశావాహులు రాష్ట్ర నాయకత్వానికి తమ దరఖాస్తులను అందజేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతుండటంతో, ప్రధానంగా హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానం నుంచి పోటీ చేసేందుకు నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. రాష్ట్రంలోని రెండు పట్టభద్రుల స్థానాల్లో విజయం సాధించి పట్టు నిలుపుకోవాలని బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. అందులో భాగంగా హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి సుమారు డజను మంది నాయకులు టికెట్ ఆశిస్తుండగా, వరంగల్ - ఖమ్మం - నల్గొండ స్థానం నుంచి ఐదుగురి వరకు పోటీ పడుతున్నారు. ఆశావాహులంతా తమకు అనుకూలంగా ఉన్న గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయించే పనిలో నిమగ్నమయ్యారు. హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్‌నగర్ స్థానానికి పోటీ పడుతున్న వారిలో ఐదారు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఎన్.వి.సుభాష్, డోకూరి పవన్ కుమార్, డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, మాజీ అధికార ప్రతినిధి సారంగుల అమర్‌నాథ్, ప్రకాశ్ రెడ్డి, గంగాపురం వెంకట్ రెడ్డి తదితరులు రేసులో ఉన్నారు. మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు మనవడు ఎన్.వి. సుభాష్ మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టారు. డోకూరి పవన్ కుమార్‌కు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మద్దతు ఉందనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. రంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి సుదీర్ఘ రాజకీయ అనుభవం ప్రాతిపదికన టికెట్ ఆశిస్తున్నారు. సారంగుల అమర్‌నాథ్ సోషల్ మీడియా ద్వారా ఓటర్ల నమోదు విధానంపై ప్రచారం చేస్తున్నారు. ఇక గంగాపురం వెంకట్ రెడ్డి, రాష్ట్ర మాజీ కార్యదర్శి ప్రకాశ్ రెడ్డిలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆశీస్సులు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు వరంగల్ - ఖమ్మం - నల్గొండ స్థానానికి సైతం పోటీ పెరిగింది. ప్రారంభంలో పెద్దగా డిమాండ్ కనిపించకపోయినా, ప్రస్తుతం ఆశావాహుల సంఖ్య పెరిగింది. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, గతంలో పోటీ చేసిన గుజ్జుల ప్రేమేందర్ రెడ్డితో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన పుల్లారావు యాదవ్ ఈ టికెట్‌ను ఆశిస్తున్న ప్రముఖులలో ఉన్నారు. టికెట్ వేటతో పాటు ఓటర్ నమోదు ప్రక్రియను ముమ్మరం చేయడంతో ఉమ్మడి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది.

# కాళేశ్వరం పునరుద్ధరణపై కీలక భేటీ.!

ప్రాజెక్టు పునర్నిర్మాణ చర్యలపై ప్రభుత్వం తీవ్ర కసరత్తు




తెలంగాణ పత్రిక ప్రతినిధి, హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ, ప్రాజెక్టు భద్రతా చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. ప్రాజెక్టులోని ప్యాకేజీలు, బ్యారేజీల పరిస్థితిని సమీక్షించడంతో పాటు, నిర్మాణంలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు, నిపుణులతో కీలక భేటీ నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, (మిగతా 2లో)

## కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ఈసీ, సీజేఐదా..?: కిషన్‌రెడ్డి



**ఢిల్లీ:** ప్రతిపక్ష నేత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని రాహుల్‌గాంధీపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అధికారం కోసం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా రాహుల్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "పార్లమెంట్‌లో విపక్షాలు నవ్వులపాలవ్వడం దేశ ప్రజలు చూశారు. ఇప్పుడు మోదీ, అమిత్‌షా, మోహన్ భాగవత్, అజిత్ ధోవల్ దేశానికి ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి కూడా గద్దె దిగాలని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఓడితే.. ఈసీ, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ది బాధ్యతా?. ఆ పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ఈసీ, సీజేఐదా..? మీకు అనుకూలంగా ఆదేశాలు ఇవ్వలేదని సీజేఐని బెదిరిస్తున్నారు. భారత్ ఏమైనా సోనియా కుటుంబ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాపర్టీనా?. భారత్‌లో కాంగ్రెస్ మార్కు, నియంతృత్వపు రాజకీయం నడవదు" అని కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

## సింగరేణి కార్మికులకు 34 శాతం బోనస్ ప్రకటన



హైదరాబాద్: సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. గతేడాది మాదిరిగానే 34 శాతం బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఒక్కో సింగరేణి ఉద్యోగికి రూ.1,53,912 వస్తుందని వివరించారు. ఒప్పంద కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. సింగరేణికి రూ.1,754 కోట్ల మేర లాభాలు వచ్చినట్లు వెల్లడించారు.

## సీఈసీని ఎందుకు కాపాడుతున్నారు?

ఆయన్ని తొలగించడానికి మోదీ, షాలకు అభ్యంతరాలేంటి? సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నలు

ఢిల్లీలో ర్యాలీకి ముందు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం

మరో స్వాతంత్ర్య పోరాటం స్థాయిలో ఉద్యమించాలని దిశానిర్దేశం



ఢిల్లీ: "భారత ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాల్లో తప్పులు జరుగుతున్నాయని అందులోని ఇద్దరు సభ్యులే చెబుతున్నారు. అలాంటప్పుడు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవడానికి ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాలకు ఉన్న అభ్యంతరాలేంటి, ఆయన్ని ఎందుకు కాపాడుతున్నారు, మీతో కలిసి ఓట్లు తొలగించడమే ఇందుకు కారణం కాదా" అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపుతో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో.. ఢిల్లీలో సోమవారం ఇండియా కూటమి చేపట్టిన 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సహా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు సోమవారం ఢిల్లీకి తరలివచ్చారు.

# కలిసికట్టుగా పోరాడుతాం!

ఓట్ల చోరులను న్యాయస్థానం ముందు నిలబెడతాం, ప్రతిపక్ష 'ఇండియా'కూటమి ప్రతిజ్ఞ

కూటమి నేతలకు రాహుల్ తేనీటి విందు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చ

జంతర్‌మంతర్‌పై ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తామన్న రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ:** దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం ఐక్యంగా పోరాడతామని, ఓట్ల చోరీకి బాధ్యులైన వారిని న్యాయస్థానం ముందు నిలబెడతామని ప్రతిపక్ష 'ఇండియా'కూటమి నాయకులు ప్రతిజ్ఞ చేశారు. నిరంకుశ పాలనపై రాజకీయ ప్రతిఘటన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఆయన మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో విపక్ష కూటమి నాయకులు, పౌర సమాజ సభ్యులకు తేనీటి విందు ఇచ్చారు. ఓట్ల చోరీకి, ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా చేపట్టబోయే నిరసనకు సంబంధించిన వ్యూహంపై ఈ సందర్భంగా చర్చించారు. జంతర్‌మంతర్ నిరసనలను నిషేధించడంపైనా చర్చ జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఆర్జేడీ నేతలు తేజస్వీ యాదవ్, మనోజ్ ఝా, జేఎంఎం నేత మహువా మాఝీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు హరేంద్ర మాలిక్, ఆనంద్ భదౌరియా, మొహిబుల్లా నద్వీ, ఎన్సీపీ(ఎస్పీ) నాయకురాలు సుప్రియా సూలే, భట్టాచార్య, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగరిక ఘోష్ , మహువా మొయిత్రాతోపాటు పౌర సమాజం సభ్యులు ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర యాదవ్ తదితరులు ఈ తేనీటి విందులో పాల్గొన్నారు.

# రూ.2,000 యూపీఐ వాణిజ్య లావాదేవీలపై ఎండీఆర్ వాయిదా



## త్వరలో కొత్త తేదీ ప్రకటిస్తామన్న ఎన్‌పీసీఐ

**న్యూఢిల్లీ:** యూపీఐ లావాదేవీలపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రూ. 2వేలు అంతకంటే ఎక్కువ మొత్తంతో కూడిన మర్చంట్ (వ్యాపార) యూపీఐ లావాదేవీలపై అదనపు ఛార్జీలు విధిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిబంధనను దీపావళి పండగ తర్వాత అమల్లోకి తీసుకురానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీలు ఇప్పటికే అమల్లోకి రావాల్సి ఉంది. అయితే, పండుగ సీజన్ కారణంగా ఈ అమలును వాయిదా వేయొచ్చంటూ పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. ఆ నివేదికలను ప్రస్తావిస్తూ... యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ అమలును దీపావళి తర్వాత వరకు వాయిదా వేసినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) మంగళవారం తెలిపింది.

## రైతు డిస్కమ్ పేరుతో ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే కుట్ర



**హైదరాబాద్:** రైతు డిస్కమ్ ఏర్పాటు జీవోను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్పష్టం చేశారు. రైతు డిస్కమ్ ఏర్పాటు చేస్తూ జీవో17 జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఉచిత విద్యుత్ సరఫరాకు పాతరేసి, రైతు మెడకు ఉరేసేందుకేనా ఈ కుట్ర? అని ప్రశ్నించారు హరీష్. వ్యవసాయానికి, గృహాలకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు రైతు డిస్కమ్ పేరుతో మరో డ్రామాకు తెరతీయడం సిగ్గుచేటన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ ఎలా దోహదపడుతుందో చెప్పకుండా మొండిగా వ్యవహరించడం దుర్మార్గం అన్నారు.

## 'నాగార్జున' వ్యవస్థాపకుడు ఎవిఎస్.రాజు కన్నుమూత



**హైదరాబాద్:** భారత నిర్మాణ రంగానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ వ్యవస్థాపకుడు చైర్మన్ ఎ.వి.ఎస్. రాజు హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన పూర్తి పేరు అల్లూరి వెంకట సత్యనారాయణ రాజు. 1937లో తూర్పు గోదావరి జిల్లా అంతర్వేది గ్రామంలో జన్మించిన ఆయన సాధారణ నేపథ్యం నుంచి దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదిగారు. 1978లో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీని స్థాపించిన ఎ.వి.ఎస్. రాజు తన అంకితభావం, పట్టుదలతో దానిని దేశంలోనే అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దారు. 1992లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన ఈ సంస్థ ప్రస్తుతం దాదాపు రూ.20,944 కోట్ల టర్నోవర్‌తో భారతదేశంలో రెండో అతిపెద్ద లిస్టెడ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీగా గుర్తింపు పొందింది. దేశ మౌలిక వసతుల కల్పన, పారిశ్రామిక అభివృద్ధికి ఆయన అందించిన విశేష సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2010లో ఆయనను ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన మృతిపట్ల పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన !

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. చినుకు పడడమే కష్టంగా మారింది. నైరుత ప్రవేశించినా చుక్కనీరు చిక్కలే దు. భూములు తడవలేదు. వ్యవసాయం పూర్తిగా పడకేసింది. నదు లు నోరెళ్లబెట్టాయి. భూగర్భజలాలు అడుగంటాయి. ప్రస్తుత పరిస్థి తులు చూస్తుంటే సాగు ఎలా ఉన్నా తాగునీటికి తీవ్ర కటకట ఏర్ప డేలా ఉంది. కృష్ణా,గోదావరి నదులు వట్టిపోయాయా అన్నట్లుగా మారాయి. ఈ పాటికి గోదావరిలో ఎగువ నుంచి నీరు వచ్చేది. దీంతో సాగు సాగేదెలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కని పించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో పంటల ఎంం కపై తీసుకునే నిర్ణయాలు విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతు న్నదని వాతావరణ శాఖ తెలియచేస్తోంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపిం చడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. అయితే వాతావరణ పరిస్థితులు నిరంతరం మారుతుం టాయని, రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితిలో మెరుగుదల సంభవించే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ రైతాంగం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మృగశిర కార్తెతో పాటు ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకుంది. జూన్ తొలి వారం నుంచే నాగలి పట్టి, నారుమళ్లు పోసి, విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. అయితే సాధారణంగా కనిపించే నైరుతి వర్షపాత చురుకుదనం ఈసారి అనేక ప్రాంతాల్లో కనిపించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవు తోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. వాతావ రణ మార్పుల కారణంగా నైరుతి రుతుపవనాల పురోగతిపై ప్రభావం చూపుతున్నాయి. భారత వాతావరణ శాఖకు సంబంధించిన గణాం కాలను ఉటంకిస్తూ ప్రచురితమైన నివేదికల ప్రకారం, వ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణ లోనూ వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటి వనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నం దున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవ సరం ఉంది. వర్షపాతం ఆలస్య మవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వ హణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళి కలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వస తుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవ స్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోం ది. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవే త్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నా యి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యా చరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలిం చాలని ప్రభుత్వం సూచిస్తోంది. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

# పప్పుధాన్యాలు తగ్గుతున్నాయ్!

- రాష్ట్రంలో పెరుగుతున్న వరి, మొక్కజొన్న, పత్తి, పంటల సాగు... ప్రత్యామ్నాయ పంటలను పట్టించుకోని రైతులు
- మూడేళ్ల పంటల తీరును వెల్లడించిన సామాజిక, ఆర్థిక సర్వే
- రైతులను ప్రోత్సహించేందుకు బోనస్ ఇచ్చే ఆలోచనలో సర్కార్
- మంత్రి తుమ్మలకు పంటల మార్పిడి బాధ్యత అప్పగింత



**హైదరాబాద్ :** తెలంగాణలో వ్యవ సాయ రంగం కొన్నేళ్లుగా స్థిరమైన పురోగతిని న మోదు చేస్తున్నప్పటికీ, పంటల వైవిధ్యంలో వెనుకబ డిపోతోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో గణనీయ మైన పెరుగుదల ఉన్నప్పటికీ.. వరి, పత్తి, మొక్క జొన్న, సోయాబీన్ మినహా ఇతర పంటల సాగులో వెనుకబడిపోతున్నట్లు సామాజిక, ఆర్థిక సర్వే వెల్ల డించింది. గత మూడేళ్లలో వివిధ పంటల సాగు తీరు తెన్నులను ఈ సర్వే కళ్లకు కట్టింది. పంటల మార్పిడి విషయంలో రైతులు మేల్కొనకపోతే రాష్ట్రంలో ప ప్పుధాన్యాల సాగు కనుమరుగయ్యే పరిస్థితి రానుంది. 2023-24లో 207.95 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 2024-25 కల్లా 232.10 లక్షల టన్నులకు పెరిగింది. 2025-26 నాటికి ఇది 236.87 లక్షల టన్నులకు చేరు కుంది. దీంతో రాష్ట్రంలో పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతోపాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఎంతగా చెబుతున్నా, రైతుల ఆలోచనలో మార్పు రావడం లేదు. ఇతర పంటలకు కోతులు, అడవి పందుల బెడద ఉండటం, దిగుబడిపై ఉన్న అనుమానాలను వ్యవసాయ అధికారులు నివృత్తి చేయకపోవడంతో రైతులు కొంతకాలంగా అలవాటైన పత్తి, వరి వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో రైతుల ఆలోచనల్లో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం ఇతర పంటలు సాగు చేసే రైతులకు బోనస్ ఇవ్వాలని యోచిస్తోంది. అందులో భాగంగానే ఈసారి బడ్జెట్‌లో పంటల బోనస్ కోసం రూ. 3,500 కోట్లు కేటాయించింది. ఇప్పుడు సన్న వడ్లకు ఇస్తున్న బోనస్‌ను పప్పుధాన్యా లు, నూనె గింజల పంటలకూ ఇచ్చే ఆలోచనలో ఉంది. ఇదే విషయాన్ని నర్మెటలో ఆదివారం జరిగిన సభలో రేవంత్‌రెడ్డి చెబుతూ, పంటల వైవిధ్యం పెంచడానికి ఏంచేయాలనే అంశంపై నిర్ణయానికి రావాలని మంత్రి తుమ్మలకు సూచించారు.

### పప్పుధాన్యాల్లో తగ్గిన స్థిరత్వం

రాష్ట్రంలో పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్థిరత్వం తగ్గిం ది. హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. 2023-24లో 3.61 లక్షల టన్నులుగా ఉన్న పప్పు ధాన్యాల ఉత్పత్తి 2024-25లో 3.99 లక్షల టన్నులకు పెరిగినప్ప టికీ, 2025-26లో ఇది 3.48 లక్షల టన్నులకు తగ్గే అవకాశం ఉందని అంచనా. పెసర, కంది, శనగలు, మినుముల ఉత్పత్తి పడిపోతుండటం పట్ల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి లభ్యత పెరగడంతో గతంలో పప్పుధా న్యాలు సాగు చేసిన భూముల్లోనూ వరి, పత్తికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించే విధానాలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

### ఒకేసారి స్థిరత్వం-మార్పు

రాష్ట్రంలో పంటల ఎంపికలో స్థిరత్వం, మార్పు అనే రెండు ధోరణులను ఒకేసారి చూపిస్తోంది. ముఖ్యంగా వానాకాలం, యాసంగి సీజన్లలో వరి ఆధిపత్యం కొనసాగుతుండగా, మొక్కజొన్న వంటి పంటలు క్రమంగా విస్తరిస్తున్నాయి. సోయాబీన్, కందిపప్పు వంటి పంటలు తగ్గుదల చూపుతు న్నాయి. యాసంగిలో జొన్న కొంత పెరుగుదల చూపుతుండగా, శనగ, వేరుశనగ తగ్గుతూ ఉ న్నాయి. మొక్కజొన్న పంట 9.8 శాతం నుంచి 13 శాతం వరకు పెరగడం రైతుల్లో మార్పు సంకేతంగా కనిపిస్తోంది.

# దారి తప్పుతున్న ఉపగ్రహాలు



**న్యూ ఢిల్లీ :** నావిగేషన్ సిస్టం ఇపుడు సుపరిచితమైన పదబంధమే. దారి ఎవరినీ అడుగన వసరం లేకుండా మ్యాప్ చూసుకుంటూ గమ్యస్థానం చేరేందుకు ఉపగ్రహాలు మార్గదర్శనం చేస్తాయి. నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టలేషన్ (నావిక్) పేరుతో భారత్ కూడా ఒక ఉపగ్రహ నావిగేషన్ సిస్టంను అభివృద్ధి చేసుకుంది. అది ఇపుడు అంత రిక్షంలో కొన ఊపిరితో ఉంది. శాస్త్ర-సాంకేతిక మంత్రిత్వ శాఖ రెండేళ్ళ క్రితమే దీనిపై ప్రశంసల జల్లు కురిపించింది. ప్రపంచ ఉపగ్రహ నావిగేషన్‌లో భారత్ స్వావలంబనకు అదొక తార్కాణంగా నిలిచిం దని పేర్కొంది. కానీ మన నావిగేషన్ ఉపగ్రహాల స్థితిగతుల గురించి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నుంచి పొడసూపుతున్న సమాచారం చూస్తూంటే, మాటలు ఎక్కువ చేతలు తక్కువ అనే నానుడి 'నావిక్'కు సరిగ్గా అతికినట్లుగా కనిపిస్తోంది.

### ఆటమిక్ క్లాక్‌ల పనితీరు?

కార్గిల్ యుద్ధం (1999) నేపథ్యంలో ఒక భారతీయ నావిగేషన్ సిస్టంను అభివృద్ధి చేసుకోవాల్సిన అవ సరం తలెత్తింది. అమెరికా నిర్వహిస్తున్న జీపీఎస్ నావిగేషన్ సిస్టం నుంచి అందుబాటులోనున్న సంకే తాలు అప్పట్లో కార్యాచరణకు సంబంధించి కొన్ని సవాళ్ళకు కారణమయ్యాయి. దాని కనుగుణంగానే 'ఇస్రో' 'నావిక్' డిజైన్, అభివృద్ధిని పూర్తి చేసింది. అది 2016 నుంచి పని చేయడం మొద లెట్టింది. ఎత్తైన ప్రాంతాలలో గ్లోబల్ సిస్టంల నుంచి సిగ్నల్స్ ఒక్కో సారి అందుబాటులోకి రావు కనుక, ముఖ్యంగా ఆ ప్రాంతాల్లో ఉపయోగపడే విధంగా 'నావిక్'కు డిజైన్ చేశారు. నావిగేషన్ ఉపగ్రహానికి 'ఆటమిక్ క్లాక్' గుండెకాయ లాంటిది. సెకనులో బిలియన్ వంతు లోపల కూడా అది సరైన స్థితిని చూప గలదు. ఈ రూబీడియం ఆటమిక్ ఫ్రీక్వెన్సీ స్టాండర్డ్స్ (ఆర్.ఏ.ఎఫ్.ఎస్.) క్లాక్‌లను ఒక స్విస్ తయారీ సంస్థ నుంచి 'ఇస్రో' సమీకరించింది. కానీ, వాటిలో కొన్ని సరిగ్గా పనిచేయలేదు. మొదటి క్లాక్ 2018లో విఫలమైంది. మిగిలిన క్లాక్‌లలో లోపాలను సరిదిద్దుతారనీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించింది. అయినా, లోపాలు కొనసాగుతూనే వచ్చాయి. దాంతో దాదాపు ఐదు ఉపగ్రహాలు ఉపయోగపడనివిగా తయార య్యాయి. యూరో పియన్ స్పేస్ ఏజెన్సీ కూడా దాని గెలీలియో ఉపగ్రహ కాన్స్టలే షన్‌లో అవే రకమైన లోపాలు తలెత్తినట్లు వెల్లడించడం ఒక్కటే ప్రభుత్వా నికి కాస్త ఊరటనిచ్చింది. ఆ ఏజెన్సీ కూడా స్విట్జ ర్లాండ్ సరఫరా చేసిన ఆటమిక్ క్లాక్‌లనే ఉపయోగి ంచుకుంది. ఇక లాభం లేదనుకున్న 'ఇస్రో', అహ్మదాబాద్ లోని స్పేస్ అప్లికేషన్స్ సెంటర్‌లో సొంతంగా రూబీడియం ఆటమిక్ క్లాక్‌లను తయారు చేయడం మొదలు పెట్టింది. వాటిని 2023 మే నెలలో ప్రయోగించిన ఎన్వీఎస్-01 ఉపగ్రహంలో ఉపయో గించారు. వాటి పనితీరుపై 'ఇస్రో' ఎలాంటి డేటాను పంచుకోలేదు కనుక, సవ్యంగానే పనిచేస్తున్నాయని భావించడం తప్ప చేయగలిగింది లేదు.

### స్మార్ట్‌ఫోన్లలో నావిక్ తక్కువే!

అంతరిక్ష విభాగం కుంటుపడినా, అవసరమైన గ్రౌండ్ విభాగాలను అభివృద్ధి చేయడం 'ఇస్రో' కొనసాగించింది. నావిగే షన్ సేవలను ఉపయోగకర మైనవిగా తీర్చిదిద్దేందుకు సర్వే గ్రేడ్ రిసీవర్లు, కాంపాక్ట్, లో-కాస్ట్ రిసీవర్ మాడ్యూళ్ళతో సహా పొత్తు కుదిరే హార్డ్‌వేర్ అవసరం. 'నావిక్' ఆధారిత స్మార్ట్ ఫోన్లు సరేసరి. నావిక్ ఆధారిత ట్రాకింగ్ సాధనాలను అమర్చుకున్న రైళ్ళు ఏ సమయంలో ఎక్కడున్నాయో పరీక్షించి చూసుకున్నారు. చేపల వేటకు వెళ్ళే మర పడవల గమనాన్ని కూడా 'నావిక్' ఆధారిత ట్రాన్స్ పాండర్లతో గమనించారు. వివిధ రకాల మోటారు వాహనాలను కూడా ఈ పరీక్షలకు ఉపయోగించుకు న్నారు. అయినా, అటు కమర్షియల్‌గా కానీ, ఇటు ప్రజోపయోగంలోకానీ 'నావిక్' విని యోగం తక్కువ స్థాయిలోనే ఉంది. భారతీయ మొబైల్ ఫోన్ మార్కెట్లో ప్రస్తుతం దాదాపు 20 మేజర్ బ్రాండ్లు, 700 రకాల ఫోన్లు ఉన్నాయి. వివిధ తయారీ సంస్థల నుంచి వస్తున్న 60కి పైగా స్మార్ట్ ఫోన్ మోడళ్ళు 'నావిక్' విని యోగానికి అనువైనవని గత ఏడాది డి సెంబర్‌లో పార్లమెంట్‌కు తెలిపారు. 'నావిక్' ఆధారిత ఫోన్లను ఉపయోగిస్తున్న వారి మొత్తం సంఖ్యను మాత్రం వెల్లడించలేదు. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రెండింటిలోనూ మార్పులు చేస్తేనే భారతీయ నావిగేషన్ సిస్టంకు వీలైన హ్యాండ్‌సెట్లు అందుబాటులోకి వస్తాయి. కొన్ని చిప్ సెట్ల తయారీ సంస్థలు'నావిక్'కు అనువైన ప్రాసెసర్లను మన దేశానికి పంపుతున్నాయి. కానీ, చాలా ఫోన్లలో 'నావిక్' సిగ్నల్స్ కనిపించడం లేదనీ, హార్డ్‌వేర్ పరంగా మద్దతు ఉన్నా, తక్కువ-స్థాయి డ్రైవర్లు సిగ్నల్స్‌ను ఫిల్టర్ చేస్తున్నాయనీ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్, పుణేలోని విశ్వకర్మ యూనివర్సిటీ నిర్వహిం చిన అధ్యయనంలో తేలింది. భారతీయ స్మార్ట్ ఫోన్ వాడకందారులు 'నావిక్'ను వినియోగించే టట్లు చేయడానికి చేయ వలసింది ఇంకా చాలా ఉందని దీన్ని బట్టి స్పష్టమవుతోంది.

### సాధ్యమయ్యే లక్ష్యాలేనా?

మొదటి తరం నావిగేషన్ ఉపగ్రహాల పనితీరులో అటు అంత రిక్షంలోనూ, ఇటు క్షేత్ర స్థాయిలోనూ అదే పనిగా సమస్యలు తలె త్తుతూండటంతో 'ఇస్రో' రెండవ తరం శ్రేణి ఉపగ్రహాల తయారీకి నడుం బి గించింది. ఈ శ్రేణిలోని మొదటి ఉపగ్రహం విజయ వంతమైంది. కానీ, 2025 జనవరిలో ప్రయోగించిన ఎన్వీఎస్-02 ఉప గ్రహం నిర్దేశించిన కక్ష్యను చేరు కోలేకపోయింది. గత సంవత్సరాంతంలో ఎన్వీఎస్-03 ప్రయోగించే యోచనలో ఉన్నట్లు ప్రభుత్వం 2025 ఆగస్టులో ప్రకటించింది. తదుపరి ఆరు నెలల్లో ఎన్వీఎస్-04, ఎన్వీఎస్-05 ప్రయోగాలు కూడా ఉంటాయని తెలిపింది. ఆ తర్వాత కొద్ది నెలలు గడిచాక, 2026 లాంచ్ షెడ్యూల్ విడుదల చేశారు కానీ, వాటిలో ఎన్వీఎస్-శ్రేణి ఉపగ్రహాల ఊసు లేదు. స్పేస్ టెక్నాలజీకి సంబంధించిన కీలక విభాగాల్లో 'ఇస్రో' కొన్ని దశాబ్దాలుగా స్వదేశీ సామర్థ్యాన్ని అభివృద్ధి పరచుకుంటూ వస్తోంది. అయితే, ప్రభుత్వ వినియోగానికి అంకితమైనవాటిని మినహాయిస్తే, ప్రజా బాహుళ్యానికి ఉపయోగపడే స్పేస్ టెక్నాలజీని అందించడంలో 'ఇస్రో' పెను సవాళ్ళను ఎదుర్కొం టోంది. కమ్యూనికేషన్లు, బ్రాడ్ కాస్టింగ్, రిమోట్ సెన్సింగ్, భూ పరిశీలనకు వివిధ విజయవంతమైన భారతీయ ఉపగ్రహాలు ఉన్నప్పటికీ, కమర్షియల్ వాడకందారులు ఇప్పటికీ విదేశీ ఉపగ్రహాలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. దూరశ్రవణ విద్యకు అంకితమైన ఎడ్యుశాట్ టెక్నికల్‌గా సఫలమైనప్పటి కీ, ప్రోగ్రమాటిక్ వైఫల్యాన్ని చవిచూసింది. నెట్‌వర్క్ కనెక్టివిటీ, కంటెంట్ జనరేషన్‌లో వెలితులు, బలమైన మేనేజ్‌మెంట్ వ్యవస్థ కొరవడటం దానికి కారణాలని ఆ ప్రోగ్రామ్ ఆడిట్ నివేదికలో వెల్లడైంది. ఇపుడు నావిగేషన్ సేవల ప్రహసనాన్ని చూస్తున్నాం. 'ఇస్రో' లోతైన ఆత్మపరిశీలన చేసుకోక తప్పదు. 2022 కల్లా మానవ సహిత అంతరిక్ష నౌకను ప్రయోగించాలని ప్రధాని 2018లో ఒక అవాస్తవిక లక్ష్యాన్ని 'ఇస్రో' ముందుంచారు. ఈ ప్రయోగానికి ఇంకా ఒకటి రెండేళ్ళు పట్టేటట్లు ఉంది. అంతలోనే ప్రధాని, భారత్‌కు 2035 కల్లా సొంత అంతరిక్ష కేంద్రం ఉండాలనీ, 2040 కల్లా చంద్రునిపైకి మనం వ్యోమగామిని పంపగలగాలనీ ఆశావహమైన కార్యక్రమాలను ప్రకటిస్తున్నారు. ఇవన్నీ 'ఇస్రో'పై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇటీవలి వైఫల్యాల నేపథ్యంలో అంతరిక్ష రంగానికి సంబంధించి తన ప్రాధాన్యాలను ప్రభుత్వం సవరించు కోవాల్సి ఉంది.

**దినేశ్ సి. శర్మ**
**వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత**

# ధర్మేంద్ర ప్రధాన్‌పై నిరసన సక్సెస్.. జ్ఞానేశ్ కుమార్‌పై ఎందుకు తడబాటు?



**న్యూ ఢిల్లీ :** కాక్రోచ్ జన్‌తా పార్టీ (సీజేపీ) జూన్‌లో అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనకు విద్యార్థులు, యువత నుంచి భారీ స్పందన వచ్చింది. అయితే, ఇప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలో అదే స్థాయి జనసమీకరణ కనిపించలేదు. రాజకీయ నాయకులు, ప్రముఖులు పాల్గొన్నప్పటికీ గత నిరసన తరహాలో ప్రజలు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి రాలేదు. ఈ రెండు ఉద్యమాల మధ్య స్పందనలో తేడాకు పలు కారణాలు కనిపిస్తున్నాయి.

### విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన తొలి నిరసన

ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా జరిగిన ఆందోళన పరీక్షల వ్యవస్థలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళనల చుట్టూ సాగింది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రశ్నపత్రాల లీకేజీ లేదా పరీక్షల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వారి ఏళ్ల కష్టాన్ని ప్రభావితం చేస్తాయి. వారి కుటుంబాలూ ఈ ప్రయాణంలో భాగస్వాములవుతాయి. అం దువల్ల ఆ సమస్యతో విద్యార్థులు వ్యక్తిగతంగా అనుసంధానమై నిరసనలో పాల్గొనేందుకు ముందుకొచ్చారు. ప్రస్తుత ఆందోళన మాత్రం ఎన్నికల నిబంధనల ప్రత్యేక సమగ్ర సవరణ, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌పై కేంద్రీకృతమైంది. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే పౌరుల ఓటు హక్కుపై ప్రభావం పడే ప్రమాదం ఉన్నప్పటికీ, పేర్ల చేర్పులు, తొలగింపులు, ఓటరు అర్హతల పరిశీలన వంటి అంశాలను సామాన్యులకు అర్థమయ్యేలా వివరించడం సవాలుగా మారింది. సమస్య ప్రజాస్వామ్యపరంగా కీలకమైనదైనంత మాత్రాన భారీ సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వస్తారని చెప్పలేం.

### పోలీసు ఆంక్షలు.. సోషల్ మీడియా ప్రభావం

తాజా నిరసనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. నివేదిక ప్రకారం, 20,000 మంది సిబ్బందిని మోహరించారు. సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. 45 మెట్రో స్టేషన్లను మూసివేశారు. జంతర్ మంతర్‌కు వెళ్లే మార్గాల్లో పలుచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేశారు. సీజేపీకి చెందిన పలువురు ప్రముఖు లు, నాయకులు, నిరసనకారులను ముందుగానే అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యలు నిరసన విస్తరించకుండా అడ్డుపడి ఉండవచ్చని విశ్లేషణ సూచిస్తోంది. గత ఉద్యమానికి సోషల్ మీడియాలోనూ విస్తృత ప్రచారం లభించింది. వీడియోలు, పోస్టులు, స్పందనలు ఆ ప్రచారాన్ని మరింత మందికి చేరవేశాయి. అయితే, ఆన్‌లైన్‌లో వైరల్ కావడం, వేల సంఖ్యలో స్పందనలు రావడం మాత్రమే ప్రజలు ప్రత్యక్షంగా నిరసనలో పాల్గొంటారని నిర్ధారించదు.

### సామాన్యులతో అనుసంధానమే కీలకం

తాజా నిరసనలో జనసమీకరణ తక్కువగా కనిపించిందని ప్రజలకు ఆ ఉద్యమంపై మద్దతు లేదని తేల్చలేం. పోలీసు ఆంక్షలు, ముందస్తు నిర్బంధాలు కూడా పాల్గొనేవారి సంఖ్యను తగ్గించి ఉండవచ్చు. అదే సమయంలో, తన ఆన్‌లైన్ మద్దతు, రాజకీయ పరిచయాలకు మించి ప్రజలను సమీకరించగల సామర్థ్యాన్ని సీజేపీ నిరూపించుకోవాల్సి ఉంది. సామాన్య ఓటర్ల రోజువారీ జీవితానికి ఎస్ఐఆర్ వల్ల కలిగే ప్రభావాన్ని స్పష్టంగా వివరించడం, క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రచారం నిర్వహించడం సీజేపీతో పాటు ప్రతిపక్షాలకు కీలకం. ప్రముఖుల భాగస్వామ్యం, ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం మాత్రమే ప్రజా ఉద్యమాన్ని నిర్మించలేవు. ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానం, స్పష్టమైన సందేశం, నిరంతర క్షేత్రస్థాయి సమీకరణే ఈ ఉద్యమానికి భవిష్యత్తులో ఎంతటి స్పందన లభిస్తుందో నిర్ణయించనున్నాయి.

# మోతే మండలంలో ఎండిపోతున్న పంటలను కాపాడాలి

- తక్షణమే సాగునీరు, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి: మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్
- రైతుల సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- సాగునీరు, విద్యుత్ అందించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శ





**సూర్యాపేట, అక్టోబరు 13, తెలంగాణ పత్రిక, జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్ : కోదాడ:** సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని మోతే మండలంలో సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఎండిపోతున్న వరి పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం లాల్ తండా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి విద్యుత్ సరఫరా పరిస్థితిని, లాగ్‌బుక్‌లను పరిశీలించారు. రైతులకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.

**ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ..** మోతే మండలంలో సాగునీరు అందక పచ్చని పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అప్పులు చేసి, తమ కష్టార్జితాన్ని పెట్టుబడులుగా పెట్టి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో నీటి కొరత కారణంగా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. రైతుల కష్టాలు, ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని విమర్శించారు.

**సాగునీటి విషయంలో ప్రభుత్వం స్పందించాలి**

ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన వ్యక్తి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందకపోవడం దురదృష్టకరమని బొల్లం మల్లయ్య యాదవ్ వ్యాఖ్యానించారు. అందుబాటులో ఉన్న కాలువల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడేందుకు ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ప్రశ్నించారు. ఒకవైపు పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతుంటే, మరోవైపు కొత్త కాలువల ప్రణాళికల పేరుతో హడావుడి చేస్తున్నారని విమర్శించారు. ముందుగా అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకుని రైతులకు నీరందించాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వకుండా రాజకీయ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు.

**నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి**

లాల్ తండా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన సందర్భంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితిని, లాగ్‌బుక్‌లను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. రైతులకు నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్ అందించడంలో లోపాలున్నాయని ఆరోపించారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేసేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పక్కనే ఉన్న మధిర నియోజకవర్గంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు చెబుతున్నారని, కోదాడ నియోజకవర్గ రైతులకు కూడా అదే స్థాయిలో నాణ్యమైన విద్యుత్ ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. విద్యుత్ అంతరాయాలు, సాగునీటి కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**రైతులను ఆదుకోవాలి.. లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తాం**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం గురించి ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వారి సమస్యలను పరిష్కరించాలని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పక్కనపెట్టి కాంట్రాక్టులు, కమీషన్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. మోతే మండలంలో ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు యుద్ధప్రాతిపదికన సాగునీరు విడుదల చేయడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు నష్టపోయిన తర్వాత స్పందించడం కాకుండా ఇప్పుడే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బొల్లం మల్లయ్య యాదవ్ హెచ్చరించారు.

## ఘనంగా పూజలందుకుంటున్న దుర్గామాత



**రేగోడు, తెలంగాణ పత్రిక అక్టోబర్ 13:** మండల కేంద్రమైన రేగోడు లోని దుర్గమ్మ ఆలయం వద్ద ప్రతిష్టించిన దుర్గామాత కు శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాకులు దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో యువకులు, పెద్దలు, నాయకులు, దుర్గామాత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

భారీ సంఖ్యలో హాజరైన రోగులు..

ఫిజియోథెరపీ, దంత వైద్య సేవలు అందజేత





**తెలంగాణ పత్రిక దమ్మపేట, అక్టోబర్ 13:** దమ్మపేటలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. స్థానికంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో రోగులు హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో ఎస్‌జే లైఫ్ ఫిజియోథెరపీ క్లినిక్‌కు చెందిన డాక్టర్ జి.వి. ప్రియకాంత్ (బీపీటీ) ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ సేవలు అందించారు. మెడ, నడుము, మోకాళ్ల నొప్పులు, కీళ్ల సమస్యలు, పక్షవాతం అనంతర సమస్యలు, కండరాలు మరియు నరాలకు సంబంధించిన ఇబ్బందులతో బాధపడుతున్న వారికి తగిన సూచనలు, చికిత్సా సేవలు అందించారు. అలాగే శ్రీరామ్ డెంటల్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ బి. రాంబాబు (బీడీఎస్) ఆధ్వర్యంలో దంత వైద్య సేవలు అందజేశారు. దంతాల పరీక్షలు, రూట్ కెనాల్ సమస్యలు, పళ్ల సరిచేయడం, పళ్ల శుభ్రత, చిగుళ్ల సమస్యలు తదితర అంశాలపై రోగులకు వైద్య సలహాలు అందించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన ఈ శిబిరంలో అనేక మంది రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఉచిత వైద్య శిబిరం ద్వారా ఫిజియోథెరపీ, దంత వైద్య సేవలు ఒకే చోట అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన వైద్య సేవలను అందించడంలో ఇటువంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## తరలి వచ్చి .. అమ్మను దర్శించి

సందడిగా అన్నప్రసాద వితరణ



**పాపన్నపేట, అక్టోబర్ 13:(తెలంగాణ పత్రిక):** మండల కేంద్రం పాపన్నపేటలో యువసేన యూత్ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కోనసాగుతున్నాయి. నీలాగైనీ సమీపన ప్రత్యేకంగా తీర్చిదిద్దిన మండపంలో కొలువు దీరిన దుర్గమ్మకు ఉదయం,సాయంత్రం వేళ అర్చకులు విశ్వనాథం,నవీన్ శర్మలు విశేష పూజలు చేశారు. మంగళవారం దాత మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ కాంతులతో ప్రకాశిస్తున్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. యూత్ సభ్యులు,మహిళాలు తదితరులు ఉన్నారు.

## సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకల్లో చదువు అన్నారెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి : (తెలంగాణ పత్రిక) అక్టోబర్, 13**

తెలంగాణ ప్రజల చిరకాల స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చడంలో సిరికొండ మధుసూదనాచారి పాత్ర ఎంతో కీలకమని సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ తొలి శాసనసభాపతి, ప్రస్తుత శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి చదువు అన్నారెడ్డి అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ ను కట్ చేసి, ప్రజలకు స్వీట్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చదువు అన్నారెడ్డి మాట్లాడారు. ఆంధ్ర పెత్తందారీ వ్యవస్థలో నలిగిపోతున్న తెలంగాణను, ఆంధ్రుల కబంధహస్తాల నుండి విముక్తి చేసేందుకు 2001లో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేతృత్వంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి వ్యవస్థాపకుడిగా, పోలిట్ బ్యూరో సభ్యుడిగా, కేసీఆర్ కు కుడి భుజంలా వ్యవహరిస్తూ.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో ఆయన చేసిన ఉద్యమ స్ఫూర్తి వర్ణనాతీతమన్నారు. స్వరాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చడమే కాకుండా..అభివృద్ధికి నోచుకోని, మారుమూల ప్రాంతమైన భూపాలపల్లికి..జయశంకర్ పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాగా నామకరణం చేసి, నూతన జిల్లాకు జీవం పోసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అదేవిధంగా స్వరాష్ట్రంలో భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు, పల్లె పల్లెకు సీసీ రోడ్లు, బస్సు సౌకర్యం, త్రాగునీటి సమస్య లేకుండా..పల్లెలను అనుసంధానం చేసిన అభివృద్ధి ప్రదాత సిరికొండ అని కొనియాడారు. 2028లో జరగబోయే శాసనసభ ఎన్నికల్లో భూపాలపల్లి బీఆర్ఎస్ అభ్యర్థిగా అధిష్టానం సిరికొండ మధుసూదనాచారిని ప్రకటిస్తే భారీ మెజార్టీతో గెలిపించి..కేసీఆర్ కు కానుకగా ఇస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మాజీ మండల ఉపాధ్యక్షుడు దానవేణి రాములు, సిరికొండ మధుసూదనాచారి వీరాభిమాని, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సలాలి సమాధానం, బీఆర్ఎస్ నాయకులు గుడిమల్ల రమేష్, అరికాంతపు అన్నారెడ్డి, కక్కెర్ల ప్రశాంత్ గౌడ్, రాస ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలిసుల దాడి

ముగ్గురు అరెస్ట్.. రూ.17,300 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



**మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక) 13 అక్టోబర్**

కూల్చారం మండలం పోతన్‌శెట్టిపల్లి గ్రామంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్ వద్ద రాత్రి పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 17,300 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో కూల్చారం గ్రామానికి చెందిన సత్యనారాయణ, శేఖర్, నర్సింలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, సమాచారం అందిన వెంటనే దాడులు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్పీ తెలిపారు.

## చిలుకూరు శివాలయం - బేతోలు మార్గంలో నరకయాతన

పట్టించుకోని అధికారులు



**చిలుకూరు , అక్టోబర్ 13, తెలంగాణ పత్రిక, జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్ ॥** ప్రసిద్ధ చిలుకూరు శివాలయానికి, బేతోలు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి తీవ్ర దుస్థితికి చేరుకుంది. కాలినడకన వెళ్లేందుకు కూడా వీలు లేకుండా రోడ్డంతా రాళ్లు, రప్పలు, శిథిలావశేషాల కుప్పలతో దయనీయంగా మారింది. నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ మార్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ముఖ్యమైన సమస్యలు:** వంతెన (బ్రిడ్జి) నోచుకోని వైనం: మార్గమధ్యలో కనీస బ్రిడ్జి సౌకర్యం లేకపోవడంతో వం-ర్షపు నీరు, మురుగునీరు రోడ్డుపైనే చేరి ప్రయాణాన్ని అత్యంత ప్రమాదకరంగా మారుస్తోంది. గుంతలు, శిథిలావశేషాల మయం: మట్టి రోడ్డుపై పగిలిన నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారంతో పాటు పైపులైన్లు ఆరుబయట అడ్డంగా తేలి ఉండడంతో ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాల బారినపడి గాయపడుతున్నారు.

**అధికారుల అలసత్వం:** ఈ దారి గుండా నిత్యం ప్రయాణించే భక్తులు, స్థానిక గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నామని మొరపెట్టుకున్నా అధికారులు, నాయకులు స్పందించడం లేదు అని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



## సోంపూర్ గ్రామంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**పోతంగల్ తెలంగాణ పత్రిక అక్టోబర్ 13**

పోతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామంలో గ్రామ పంచాయితీ ఆవరణలో సర్పంచ్ పవర్ కోమల్ సంజీవ్ పటేల్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు చిన్నారులు నూతన వస్త్రాలను ధరించి బతుకమ్మలను రంగు రంగుల పూలతో పేర్చి గోబీయ్యాలు వేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో ఆడపడుచులకు గ్రామంలోని ఆడపడుచులకు చిన్నారులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు ఆత్మ గౌరవాన్ని పెంపొందించే పండగలో ఒకటి పవిత్రమైన పండగ బతకమ్మ పండగని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోమల్ సంజీవ్ పటేల్, ఉపసర్పంచ్ ఔసాజి, గ్రామ పెద్దలు, పవర్ శంకర్ పటేల్, బాబు పటేల్, శివాజీ పటేల్, మంగలి వెంకటి, జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు పోచిరాం, సోన్ కామ్లే కమలాకర్, సింది అశోక్ పటేల్, జగదీష్, సాయినాథ్, చాకురే గంగాధర్, సిందే వసంతరావు, గ్రామ మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓబులాపూర్ తండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి 20 లక్షలు మంజూరు



**జగిత్యాల, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ఓబులాపూర్ తండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం రూ 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కొరకు నిధుల మంజూరుకు కృషి చేసిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## చేసిన అభివృద్ధి పనులను చేయలేదనడం సిగ్గుమాలిన ధర్మం

పెసరు రమేష్



**ధర్మసాగర్, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం ధర్మసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెసరు రమేష్ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు అభివృద్ధిలో కడియం శ్రీహరి కీలక పాత్ర పోషించారని, దేవాదుల పనులకు రూ. 1.04 కోట్ల నిధులు కేటాయించినప్పటికీ రాజయ్య హయాంలో పనులు ప్రారంభం కాలేదని ఆరోపించారు. 15 ఏళ్ల పాటు నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. కడియం శ్రీహరి రెండున్నరేళ్లలోనే నియోజకవర్గానికి రూ. 1,500 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాజకీయ విమర్శలు అభివృద్ధి, విధానాలకే పరిమితం కావాలని, వ్యక్తిగత విమర్శలు సరికాదని పేర్కొన్నారు. రాజయ్య వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రపు రాజేంద్రప్రసాద్, జిల్లా కార్యదర్శులు మునిగాల యాకూబ్, బత్తిని ఎల్లాగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ బొడ్డు ప్రదీప్ కుమార్, మండల సమన్వయ కమిటీ సభ్యులు చాడ నరసింహారెడ్డి, కొత్తపెల్లి బిక్షపతి, యాకూబ్ పాషా, సర్పంచులు మాచర్ల జ్యోతి, ఏలియా, తోట నాగరాజు, ఉపసర్పంచ్ కొంతం కొమురమ్మ, గ్రామ శాఖ అధ్యక్షుడు గంటె సాంబరాజు, కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ విగ్రహ ఏర్పాట్లను పరిశీలిలించిన సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు



**జయశంకర్ భూపలపల్లి జిల్లా ప్రతినిధి (తెలంగాణపత్రిక ) అక్టోబర్, 13**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి-ముల్కలపల్లి గ్రామాల మధ్యన గల శ్రీ సమ్మక్క-సారలమ్మ దేవస్థాన ప్రాంగాణంలో ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో..ఉత్సాహంగా, ఆటపాటలతో ఆడుకునే సద్దుల బతుకమ్మ వేడుకలలో భాగంగా..మొగుళ్లపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు ఆడపడుచుల కోరిక మేరకు నూతనంగా బతుకమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు బతుకమ్మ విగ్రహ ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా పంచాయతీ సిబ్బందిచే గ్రామంలోని వీధులను, ముఖ్య కూడళ్లను శుభ్రం చేయిస్తూ..రోడ్లకు ఇరువైపులా ఉన్న ముండ్ల పొదలను తొలగిస్తూ..గ్రామంలో వెలుగులు విరజిమ్మేలా వాడ వాడల వీధిలైట్లను ఏర్పాటు చేస్తూ..ఆడపడుచులు ఆనందోత్సవాల మధ్య బతుకమ్మను నిర్వహించుకునేలా కృషి చేస్తున్నారు. కాగా సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు చేస్తున్న కృషిని ప్రజలు, అధికారులు అభినందిస్తున్నారు.

## సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

అంకుషాపురం గ్రామ సర్పంచ్ క్యాతరాజు కవిత-లింగమూర్తి దంపతులు




**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి (తెలంగాణపత్రిక) అక్టోబర్, 13:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం అంకుషాపురం గ్రామంలో సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించేందుకు గ్రామ సర్పంచ్ క్యాతరాజు కవిత-లింగమూర్తి దంపతులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామంలో కాంతులు వీరజిమ్మేలా వీధిలైట్ల ఏర్పాటుతో పాటు, వీధులన్నీ శుభ్రం చేయిస్తూ..గ్రామాన్ని సుందరీకరణ చేయడం, వాడ వాడలా ఉన్న రోడ్లను శుభ్రపరచడం, గ్రామంలోని చెత్త, చెదారాన్ని తొలగించడం, మహిళలంతా ఆనందోత్సహాల మధ్య ఆటపాటలతో బతుకమ్మను ఆడుకునే విధంగా చర్యలు చేపట్టడం లాంటి భారీ ఏర్పాట్లను చేస్తున్నారు. దీంతో గ్రామంలోని ప్రజలంతా సర్పంచ్ దంపతులు చేస్తున్న కృషిని అభినందిస్తున్నారు.

# ఎల్‌నినో ప్రభావం, నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగాన్ని అప్రమత్తం చెయ్యాలి






ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలీ

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 13:** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వర్షపాతం పరిస్థితులు, పంటల సాగు విస్తీర్ణం, భూగర్భ జలాల లభ్యత, ప్రత్యామ్నయ పంటల సాగు, విత్తనాల సరఫరా, వ్యవసాయ, విద్యుత్తు, మంచినీటి తదితర రంగాలపై ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలపై కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సీజన్‌తో పోలిస్తే ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైనట్లు వివరించారు. ఎల్ నినో వల్ల భూగర్భ జలాలు, చెరువులు, ఇతర నీటి వనరులపై ప్రభావం పడే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు వరి సాగుపైనే ఆధారపడకుండా కంది, మొక్కజొన్న, పెసలు, మినుములు, శనగ, వేరుశనగ, సోయాబీన్, జొన్న, సజ్జ తదితర పప్పుధాన్యాలు, నూనెగింజలు మరియు చిరుధాన్యాల సాగు వైపు మళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. పంటల సాగులో వైవిధ్యీకరణ ద్వారా తక్కువ నీటి వినియోగంతో మెరుగైన ఆదాయం పొందే అవకాశాలను రైతులకు వివరించాలన్నారు. వరి సాగు వల్ల కలిగే లాభనష్టాలతో పాటు ప్రత్యామ్నయ పంటల సాగు ద్వారా కలిగే ఆర్థిక ప్రయోజనాలు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, మద్దతు ధరలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నయ పంటల సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన విత్తనాల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. కంది, పెసర, మినుము, శనగ, వేరుశనగ, సోయాబీన్, జొన్న, సజ్జ తదితర పంటల విత్తనాలకు సంబంధించి సబ్సిడీ వివరాలతో కూడిన సమగ్ర ప్రొఫార్మాను సిద్ధం చేయాలన్నారు. మండలాలు, గ్రామాల వారీగా రైతుల నుంచి విత్తనాల డిమాండ్‌ను సేకరించి, అవసరమైన విత్తనాల కొరకు ప్రతిపాదనలను తక్షణమే సమర్పించాలని సూచించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో అమలు చేయాల్సిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రాబోయే రెండు రోజుల్లోగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, నీటిపారుదల తదితర శాఖలు తమ పరిధిలోని పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చర్యలతో నివేదికలు అందించాలన్నారు. వ్యవసాయ శాఖ నోడల్ శాఖగా వ్యవహరిస్తూ అన్ని సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. గ్రామ, మండల స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఏయే పంటలను కొనుగోలు చేస్తారు, వాటికి వర్తించే మద్దతు ధరలు, కొనుగోలు విధానం తదితర అంశాలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయంతో పాటు నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలపై ప్రభావాన్ని అంచనా వేసి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వేసవిలో.మంచినీటి సమస్య రాకుండా సమ్మర్ యాక్షన్ ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. రబీ సాగు కంటే ముందునుండే పంటల సాగుపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్తు, మున్సిపల్ కమిషనర్, జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ, , నీటిపారుదల డివిజన్ల ఈఈలు జిల్లా పంచాయతీ డి ఎల్ పి ఓ లు , తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ఉద్యమ కారులపై కేసులను ఎత్తివేయాలి

ఎమ్మార్పీఎస్ నేత నక్క సతీష్ మాదిగ



**జగిత్యాల, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో భాగంగా ఎమ్మార్పీఎస్ నాయకులపై నమోదైన కేసులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎమ్మార్పీఎస్ నేత నక్క సతీష్ మాదిగ డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం కోసం పోరాడిన ఉద్యమ కారులపై కేసులు కొనసాగించడం సరికాదని ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా స్పందించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు 2022లో మల్యాల ఎక్స్‌రోడ్ వద్ద నిర్వహించిన రహదారి దిగ్బంధం కార్యక్రమానికి సంబంధించి నమోదైన కేసు విచారణలో భాగంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం జగిత్యాల కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో ఎమ్మార్పీఎస్ నాయకులు మీసాల సాయిలు నక్క సతీష్ మాదిగపై మల్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ ప్రక్రియలో భాగంగా వారు ఎమ్మార్పీఎస్ తరఫు న్యాయవాది బిరుదుల లక్ష్మణ్‌తో కలిసి కోర్టుకు హాజరై న్యాయపరమైన ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నక్క సతీష్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనలో ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయం సమాన హక్కుల సాధన కోసం ఉద్యమించిన నాయకులపై నమోదైన కేసులను ప్రభుత్వం పునఃపరిశీలించి వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులపై కేసులు కొనసాగించడం వల్ల వారి పోరాట స్ఫూర్తిని దెబ్బ తీయకూడదని ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడిన నాయకులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ నాయకులపై నమోదైన కేసులన్నింటినీ ఉపసంహరించుకుని ఉద్యమ కారులకు న్యాయం చేయాలని నక్క సతీష్ మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## సాంకేతిక వైద్య సేవల్లో యశోద ఆసుపత్రి ముందంజలో ఉంటుంది

ప్రతి నెల రెండవ మంగళవారం జగిత్యాలలో వైద్యుల అందుబాటులో ఉంటారు

రోబోటిక్ సర్జరీతో కీళ్ల సమస్యలకు చికిత్స డాక్టర్ విక్రమ్ బైరి




**జగిత్యాల, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** ఆధునిక వైద్య సాంకేతికతను అందిపుచ్చుకుంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో యశోద ఆసుపత్రి ముందుంటుందని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు విక్రమ్ బైరి అన్నారు. జగిత్యాల పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు విక్రమ్ బైరి మాట్లాడుతూ ఎముకల అరుగుదల కీళ్ల సమస్యలతో బాధపడుతున్న పలువురికి ఆధునిక సాంకేతికతతో కూడిన రోబోటిక్ సర్జరీ ద్వారా చికిత్స అందించినట్లు తెలిపారు. జగిత్యాల జిల్లా నుంచి ఎంతో మంది హైదరాబాద్‌లోని తమ ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారని గుర్తు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఇతర కారణాలతో హైదరాబాద్‌కు పోలేని రోగులకు వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రతి నెల రెండవ మంగళవారం జగిత్యాల పట్టణంలోని కనెక్ట్ ఆసుపత్రి యందు అందుబాటులో ఉంటామని తెలిపారు. పట్టణ ప్రజలతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల వారు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కీళ్ల సమస్యలకు రోబోటిక్ సర్జరీ ద్వారా ఆధునిక చికిత్స అందిస్తున్నామని తగిన వైద్య విధానాలతో రోగులు త్వరగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం తమ ఆసుపత్రిలో ఈ. హెచ్. ఎస్ సదుపాయం కూడ అందుబాటులో ఉందని డాక్టర్ విక్రమ్ బైరి తెలిపారు. ఈ సమావేశంలో మేనేజరులు రాజేష్, ఎగ్జిక్యూటివ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వేతో రైతులకు ప్రయోజనం

పెరల్స్ అగ్రోటెక్ సర్వేను పరిశీలించిన కలెక్టర్:భవేశ్ మిశ్రా



**తానూర్: 13అక్టోబర్(తెలంగాణ పత్రిక):** మండల కేంద్రంలో కొనసాగుతున్న పెరల్స్ అగ్రోటెక్ కార్పొరేషన్ లిమిటెడ్ సర్వేను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న తీరును, ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వేకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని సూచించారు. సర్వే వివరాల నమోదులో జాగ్రత్తలు పాటించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పూర్తి సమాచారాన్ని సేకరించాలని అధికారులకు సూచించారు. భూ సర్వే ద్వారా భూములకు సంబంధించిన వివరాల్లో స్పష్టత ఏర్పడటంతో పాటు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఆయవ వెంట తహసీల్దార్ మహేందర్ నాథ్, మాజీ సర్పంచ్ మాధవ్ రావ్ పటేల్,ఆర్ఐ, సర్వేయర్,జీపీవో, తదితరులు పాల్గొన్నారు.

## మెట్‌పల్లి ఆర్టీసీ డిపో సిబ్బందికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం

జగిత్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి సలహాలు సూచనలు



**జగిత్యాల, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల జిల్లా మెట్పల్లి ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన విపత్తుల ముప్పు తగ్గింపు అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మెట్‌పల్లి ఆర్టీసీ బస్ డిపోలో డ్రైవర్లు కండక్టర్లు ఇతర సిబ్బందికి (సీపీఆర్) పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జగిత్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీపీఆర్ చేయడం నేర్చుకోవాలని అత్యవసర వైద్య పరిస్థితుల్లో ముఖ్యంగా గుండె ఆగిపోయినప్పుడు సకాలంలో సీపీఆర్ చేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. వైద్య సహాయం అందేలోపు సీపీఆర్ చేయడం బాధితుల ప్రాణాలను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సీపీఆర్ పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో వివిధ పాఠశాలలు కళాశాలల్లో కూడా సీపీఆర్ అవగాహన శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే నైపుణ్యాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ హరి జగిత్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి పూదరి నరేందర్ గౌడ్, మేనేజింగ్ కమిటీ సభ్యులు కందుకూరి కృష్ణారెడ్డి, చిట్ల రాజ మనోహర్ రెడ్డి, మచ్చ నారాయణ, తుమ్మనపల్లి సత్యనారాయణ, చిత్తారి మధుకర్, సిరిపురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణలో చండిక అమ్మవారు



**పాలకుర్తి,అక్టోబర్ 13(తెలంగాణ పత్రిక):** శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మూడవ రోజు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకరణలో చండి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, ఆలయ అర్చకులు,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ తొలి స్పీకర్ మధుసూదనాచారికి ఘనంగా జన్మదిన వేడుకలు

**ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలి.. తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి**

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకుల ఆకాంక్ష**



**ఆత్మకూరు, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభ స్పీకర్, శాసనమండలి సభ్యులు సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను ఆత్మకూరు మండలంలోని గూడెప్పాడ్ సెంటర్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫోరం ఆత్మకూరు మండల కమిటీ అధ్యక్షుడు ఎండీ బాబుమియా (చిరు) నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**ప్రజాసేవలో ఆయురారోగ్యాలతో ముందుకు సాగాలి**

ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుసడ్ల సదానందం మాట్లాడుతూ, సిరికొండ మధుసూదనాచారి నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్ర అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని కోరుకున్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రగతి కోసం ఆయన మరిన్ని సేవలు అందించాలని పేర్కొన్నారు.

**ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన పోరాటం, త్యాగాలు చిరస్మరణీయమని సదానందం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేలా సంబంధిత ప్రభుత్వ వర్గాలతో చర్చిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు.

**పలువురు ఉద్యమకారుల హాజరు**

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా యువజన కార్యదర్శి వంగేటి ప్రభాకర్, ఆత్మకూరు మండల అధ్యక్షుడు ఎండీ బాబుమియా, ఉపాధ్యక్షుడు అంకత రవి, ప్రధాన కార్యదర్శి దుంక దువ్వ రాజన్న, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు భాషబోయిన సాగర్, నీరుకుళ్ల గ్రామ అధ్యక్షుడు పసుల లక్ష్మీనారాయణతో పాటు పలువురు తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు. మధుసూదనాచారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## అన్నపూర్ణాదేవిగా ఏడుపాయల వనదుర్గమ్మ

వైభవోపేతంగా సాగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఊరురా ఘనంగా పూజలు అందుకుంటున్న దుర్గమ్మ

నేడు మహాచండీ దేవిగా వనదుర్గమ్మ



**పాపన్నపేట, అక్టోబర్ 13:(తెలంగాణ పత్రిక):** జనమేజయుని సర్పయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వన దుర్గాదేవి క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి మూడో రోజు మంగళవారం తదియ పురస్కరించుకొని వనదుర్గామాతను అన్నపూర్ణాదేవి రూపంలో, నీలం రంగు చీర వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వేకువ జామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి నీలం రంగు చీర, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మ దర్శనం కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఊరురా కొలువుదీరిన అమ్మవారికి ఉత్సవాల్లో భాగంగా ఘనంగా పూజలు జరుగుతున్నాయి.

**నేడు మహా చండీ దేవిగా వనదుర్గమ్మ దర్శనం**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాల్గవ రోజైన బుధవారం వన దుర్గామాత మహా చండీ (కుష్మాండ) దేవి రూపం, ఆకు పచ్చ రంగు వస్త్రంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని ఆలయ అర్చకులు తెలిపారు.

## దుర్గాదేవిల వద్ద భక్తుల ప్రత్యేక పూజలు

మూడో రోజు చంద్ర ఘంటా అవతారంలో అమ్మవారు



**ముధోల్:13అక్టోబర్(తెలంగాణ పత్రిక):** మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్టించిన దుర్గాదేవి ల వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రతిరోజు పూజలను చేపడుతున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ పరాశక్తి దుర్గామాత వద్ద ప్రణీత్ మహారాజ్ ఆధ్వర్యంలో హారతి కార్యక్రమాన్ని చేపట్టారు. మూడవ రోజు అమ్మవారు భక్తులకు చంద్ర ఘంటా అవతారంలో దర్శనం ఇవ్వన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి, మంగళహార తులు సమర్పించి తమ మొక్కుల ను చెల్లించుకున్నారు. అమ్మవారి కృపతో తమ కుటుంబాలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి కోరుకున్నారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను దుర్గామాత కమిటీ సభ్యులు అందజేశారు.

## నంగునూరు సీహెచ్‌సీలో స్త్రీ వైద్య సేవలు

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలకు సదుపాయం

గర్భిణులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నంగునూరు సీ హెచ్ సీ స్త్రీ వైద్య నిపుణురాలు రమాదేవి



**నంగునూరు, అక్టోబరు 13(తెలంగాణ పత్రిక):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, మహిళలకు స్త్రీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని స్త్రీ వైద్య నిపుణురాలు రమాదేవి తెలిపారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ నంగునూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన సలహాలు అందిస్తున్నట్లు తెలిపారు. గర్భం దాల్చినప్పటి నుంచి వైద్యుల సూచనల మేరకు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రమాదేవి తెలిపారు. వైద్యులు సూచించిన జాగ్రత్తలను పాటించాలన్నారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి రావాలని సూచించారు. నంగునూరు మండలం, పరిసర గ్రామాల మహిళలు కూడా ఈ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు. ప్రసవ సమయం సమీపించక ముందే వైద్యులను సంప్రదించి తగిన సలహాలు పొందాలని గర్భిణులకు సూచించారు. తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణకు కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని సురక్షిత ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## బతుకమ్మ తో తెలంగాణ సంస్కృతికి ప్రపంచ వ్యాప్త గుర్తింపు

ప్రకృతిని పూలతో పూజించే సంప్రదాయం తెలంగాణ ప్రత్యేకత

రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రధానాచార్యుడు బూరం అభినవ్



**నంగునూరు, అక్టోబరు 13(తెలంగాణ పత్రిక):** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రపంచ వేదికపై ప్రత్యేక గుర్తింపును తెచ్చిందని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రధానాచార్యుడు బూరం అభినవ్ అన్నారు. రాజగోపాలపేట లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ లో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలను ప్రారంభించిన ప్రధానాచార్యుడు బోరం అభినవ్ మాట్లాడుతూ, ప్రకృతిని పూలతో పూజించే సంప్రదాయం తెలంగాణకు ప్రత్యేకమని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మహిళా సిబ్బంది, విద్యార్థినులు కలిసి బతుకమ్మలను పేర్చారు. సంప్రదాయ బద్ధంగా వేడుకలను నిర్వహించి పండుగ విశిష్టతను చాటి చెప్పారు. వివిధ విభాగాల అధిపతులు సయ్యద్ షాహబాజ్, పాతూరి శ్రీనివాసరెడ్డి, వై.రాజు,ఏవో రాజేశ్, మహిళా సిబ్బంది కవిత, జ్యోతి, దీపిక, మంజుల, వాణి, బాల మణి, లావణ్య, అనిత, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గాజుల అలంకరణలో దర్శనమిచ్చిన జయదుర్గ అమ్మవారు



**జగిత్యాల, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల పట్టణంలోని విద్యానగర్‌లో జయదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ జయదుర్గ అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జయ దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ సీఐ కరుణాకర్ జయ దుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో జయదుర్గా సేవా సమితి నిర్వాహకులు ముసిపట్ల లక్ష్మీనారాయణ దాసరి దామోదర్ నలువాల శ్రీకాంత్ బిట్టు గాదె కార్తీక్ అలిశెట్టి కిషన్ సింగారావు నడిపి గంగారాం ఫాని భూషణ్ ప్రసన్న కట్ట శ్రీరామ్ భగీరథ సాయి హరీష్ తిరుపురం రాంచందర్ ద్యావనపెల్లి శంకర్ తదితరులు యూత్ సభ్యులు పాల్గొన్నారు.



## చెల్పూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు ధర్నా

రైతులకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

రైతులకు న్యాయమైన 24 గంటల విద్యుత్ అందించాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి :తెలంగాణపత్రిక :అక్టోబర్, 13**

రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ జయ శంకర్ భూపల పల్లి నియోజకవర్గం వర్గం గణపురం మండలం చెల్పూర్ గ్రామంలోని జాతీయ రహదారి 353 పై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల రైతులు నిర్వహించిన ధర్నాకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి హాజరై రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలు, లో వోల్టేజీ పి కారణంగా మోటార్లు కాలిపోతున్నాయని, పంట పొలాలకు సరిపడా నీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి తక్షణమే 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వరి పంట చివరి దశలో ఉందని, మిర్చి పంటకు కూడా నీటి అవసరం అధికంగా ఉందని పేర్కొన్నారు. అక్టోబర్ నెలలో పంటలకు నీరు అత్యవసరమని, మరో నెల రోజుల తర్వాత నీటి అవసరం తగ్గే అవకాశం ఉన్నందున ఈ కీలక సమయంలో రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ప్రభుత్వం 24 గంటల విద్యుత్ అందించలేని పరిస్థితిలో కనీసం 15 నుంచి 16 గంటలైనా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ, మధ్యలో పలుమార్లు కోతలు విధిస్తున్నారని విమర్శించారు. లో వోల్టేజీ కారణంగా విద్యుత్ మోటార్లు దెబ్బతింటున్నాయని, రైతులకు అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. ధర్నా చేస్తామని రైతులు ప్రకటించిన తర్వాత రాత్రిపూట విద్యుత్ సరఫరా చేసినప్పుడు, సాధారణ రోజుల్లో అదే విధంగా ఎందుకు సరఫరా చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, ఎన్పీడీసీఎల్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై తక్షణమే స్పందించాలని గండ్ర కోరారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై సమీక్ష నిర్వహించి డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక విద్యుత్ అధికారులు తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అవసరమైతే గృహ, పారిశ్రామిక విద్యుత్ వినియోగంలో తగిన సర్దుబాట్లు చేసైనా వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ అందించి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న యాప్ విధానం కారణంగా యూరియా, డీఏపీ వంటి ఎరువులు పొందడంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కొందరు వ్యాపారులు ఈ పరిస్థితులను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారని ఆరోపించారు. విద్యుత్, ఎరువుల సమస్యలతో రైతులు సతమతమవుతున్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించారని, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. రైతుల సమస్యలను అర్థం చేసుకుని ప్రస్తుత ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో వ్యవహరించాలని అన్నారు. రైతుల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే తాము రోడ్డుపైకి రావాల్సి వచ్చిందని, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి, ఈ కీలక సమయంలో సరిపడా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. 24 గంటల విద్యుత్ అందించలేని అసమర్థ ప్రభుత్వం అంటూ విమర్శించారు.

## భూ వివాదం నేపథ్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు




**ఇల్లంతకుంట అక్టోబర్ 13 తెలంగాణ పత్రిక:** అనంతారం గ్రామ శివారులోని సర్వే నెంబర్లు 119/ఇ మరియు 122/ఆ లలో భూ వివాదం నెలకొనడంతో అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. వొల్లాల నర్సయ్య, అతని అన్న మధ్య భూ వివాదం నడుస్తున్నందున శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సిరిసిల్ల ఆర్డీఓ 164 దీపీూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల మేరకు మంగళవారం గిర్దావర్ సంతోష్, GPO లు వివాదాస్పద భూమి వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

## ఎన్‌సీఎల్ పరిశ్రమ బస్సు ఢీకొని రిక్షా కార్మికుడు మృతి

హుజూర్‌నగర్ పాత బస్టాండ్ ఎదురుగా ఘోర రోడ్డు ప్రమాదం అక్కడికక్కడే మృతి



**సూర్యాపేట జిల్లా। అక్టోబర్ 13। తెలంగాణ పత్రిక। జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్: హుజూర్‌నగర్:** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని పాత బస్టాండ్ ఎదురుగా మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎన్‌సీఎల్ పరిశ్రమకు చెందిన బస్సు ఢీకొనడంతో రిక్షా కార్మికుడు పిట్టల రమణ (70) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో రిక్షా కార్మికుడు మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. రోజువారీ జీవనోపాధి కోసం రిక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్న పిట్టల రమణ మృతితో స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పట్టణంలోని రద్దీ ప్రాంతమైన పాత బస్టాండ్ ఎదురుగా ఈ ప్రమాదం జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కేంద్రంలో భాజపాపై వ్యతిరేకత పెరుగుతోంది

మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్ :** కేంద్రంలోని భాజపా ప్రభుత్వంపై ప్రజల్లో క్రమేణా వ్యతిరేకత పెరుగుతోందని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మండలిలోని తన ఛాంబర్‌లో మంగళవారం మీడియాతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "దేశవ్యాప్తంగా జరిగిన, జరుగుతున్న పరిణామాలు కేంద్రంపై ఒత్తిడి పెంచుతున్నాయి. భాజపాపై వ్యతిరేకత పెరుగుతున్న క్రమంలోనే.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ఆదరణ పెరుగుతోంది. నాకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచన ఉంది" అని గుత్తా పేర్కొన్నారు.

# హుజూర్‌నగర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల ప్రత్యేక చర్యలు





**రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే చలానాలు.. కేసులు నమోదు చేస్తాం: పోలీసుల హెచ్చరిక**

**పాత బస్టాండ్ వద్ద ప్రమాదం నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు ముమ్మరం**

**సూర్యాపేట। అక్టోబర్ 13। తెలంగాణ పత్రిక। జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్: హుజూర్‌నగర్:** పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను నియంత్రించడంతో పాటు రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించేందుకు హుజూర్‌నగర్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం పాత బస్టాండ్ ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రిక్షా కార్మికుడు పిట్టల రమణ (70) మృతి చెందిన నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసులు మరింత దృష్టి సారించారు.

**ఆక్రమణల తొలగింపునకు చర్యలు**

పట్టణంలోని పాత బస్టాండ్ పరిసరాల్లో రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల కారణంగా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో సీఐ చరమంద రాజు ఆదేశాల మేరకు ఎస్ఐలు చలికంటి నరేష్, హనుమా నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. రహదారులపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకున్నారు.

**ఆక్రమణదారులపై కఠిన చర్యలు**

రోడ్లపై అనధికారికంగా తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం, దుకాణాల ఎదుట బోర్డులు ఏర్పాటు చేసి పాదచారులకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చలానాలు విధించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

**ఆటోల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి**

పాత బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆటోలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. పాదచారులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి విముక్తం చేయడంపై దృష్టి సారించారు.

**ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**

పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రజలు, వ్యాపారులు పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలకు పాల్పడకుండా, వాహనాలను నిర్ణీత ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలని సూచించారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

## చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా అధికారికంగా ప్రకటించాలి

బీజేపీ చిలుకూరు మండల అధ్యక్షుడు పారెల్లి మహేష్



**సూర్యాపేట జిల్లా। అక్టోబర్ 13। తెలంగాణ పత్రిక। జిల్లా ప్రతినిధి భట్టు సంతోష్ తోళా నాయక్: చిలుకూరు:** మెదక్ పట్టణ ప్రవేశంలోని ఆటో నగర్ కూడలి వద్ద తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడాన్ని బీజేపీ చిలుకూరు మండల అధ్యక్షుడు పారెల్లి మహేష్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తన నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారెల్లి మహేష్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి, హక్కుల పోరాటానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. అటువంటి మహనీయురాలి విగ్రహాన్ని ధ్వంసం చేయడం తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**సీసీటీవీ కెమెరాల పనితీరుపై విచారణ జరపాలి**

ప్రమాదం జరిగిన ప్రాంతంలో సీసీటీవీ కెమెరాలు పనిచేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మహేష్ పేర్కొన్నారు. పోలీసులు ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి సమగ్ర విచారణ చేపట్టాలని, నిందితులను గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**కొత్త విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి**

ధ్వంసమైన విగ్రహం స్థానంలో వెంటనే నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని మహేష్ డిమాండ్ చేశారు. చాకలి ఐలమ్మను అధికారికంగా 'తెలంగాణ తల్లి'గా ప్రకటించాలని కోరారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోతే రజక సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ చరిత్రలో చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తికి తగిన గౌరవం కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని పారెల్లి మహేష్ కోరారు.

## భక్తిపారవశ్యంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు

మంత్రోచ్ఛారణలు, వేద మంత్రాల నడుమ అమ్మవారికి విశేష అర్చనలు



**ఆత్మకూర్: అక్టోబర్ 13, (తెలంగాణ పత్రిక):** ఆత్మకూరు మండల కేంద్రంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో దుర్గామాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంగా నిర్వహించారు. అమ్మవారి నామస్మరణలు, మంత్రోచ్ఛారణలతో పూజా ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు భక్తిపారవశ్యంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజారి వైద్య మనోజ్ మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. కాగా దుర్గామాత మంగళవారం అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. జగన్మాత దుర్గాదేవిని భక్తితో ఆరాధిస్తూ లోకకల్యాణం, సకల జనుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు. దుష్టశక్తులపై దైవశక్తి విజయానికి ప్రతీకగా నిలిచే దుర్గామాత అనుగ్రహం సర్వజనులపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. దుర్గామాత ఆరాధనలో అంతర్లీనంగా ఉన్న భక్తి, ధర్మం, శక్తి, ఆత్మవిశ్వాసం వంటి ఆధ్యాత్మిక భావనలు భక్తులను భక్తి మార్గంలో నడిపిస్తాయని ఈ సందర్భంగా భక్తులు పేర్కొన్నారు. అమ్మవారి దివ్య సన్నిధిలో పూజలు నిర్వహించడం ద్వారా మనసుకు ప్రశాంతత, ఆధ్యాత్మిక చింతన, ధర్మంపై విశ్వాసం మరింత బలపడతాయని విశ్వసించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు హిందూ ధర్మ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పరిరక్షణకు దోహదపడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంపెల్లి రవీందర్, వెల్దె కపిల్ , మార్త రంజిత్ కుమార్, కొంపల్లి మణికుమార్, రాజు, అభిషేక్, సుమంత్ తేజ, రాజేష్, శశాంక్, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గంగాధరలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



**ఇల్లంతకుంట అక్టోబర్ 13 తెలంగాణ పత్రిక:** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గంగాధర క్షేత్రంలో మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన పూజ నిర్వహించగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపకులు మూగు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. బస్టాండ్ ఆవరణలో హిందూ వాహిని ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలోనూ అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అక్కడ దుర్గాదేవి మాలధారుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## జగిత్యాల జిల్లా యువతకు ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ షార్ట్ ఫిలిమ్ పోటీలకు ఆహ్వానం

జిల్లా ఎస్పి అశోక్ కుమార్ పిలుపు



**జగిత్యాల, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** శాంతి భద్రతల మరియు సమాజ రక్షణలో తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా పెట్టి పోరాడి వీరమరణం పొందిన అమర పోలీసుల జ్ఞాపకార్థం అక్టోబర్ 21 నాడు జరుగు " పోలీస్ ఫ్లాగ్ డే " సందర్భంగా పోలీస్ రిలేటెడ్ అంశం మీద ఫోటో గ్రఫీ షార్ట్ ఫిలిం తీయడానికి జిల్లాలో ఆసక్తి గల యువతక ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు ముందుకు రావాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల త్యాగాలు పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే తీసిన (3) ఫోటోలు తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్ర స్థాయి పోటీల కోసం అక్టోబర్ 23 వ తేదీ సాయంత్రం లోగా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో అందజేయాలని పిలుపునిచ్చారు . షార్ట్ ఫిలిం 3 నిమిషాలు మించకుండా 10 × 8 సైజ్ ఫోటోలను షార్ట్ ఫిలింను పెన్ డ్రైవ్ లో మీ యెక్క పూర్తి వివరాలతో అందజేయలని జిల్లా స్థాయిలో సెలెక్ట్ అయిన మూడు షార్ట్ ఫిలింలను ఫోటోలను రాష్ట్ర స్థాయి పోటీల గురించి డీజీపీ ఆఫీస్ హైదరాబాదుకు పంపించడం జరుగుతుందని తెలిపారు.

## దొడ్డి కొమరయ్య పాన్ ఇండియా సినిమా వాల్ పోస్టర్ ఆవిష్కరించిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్

తెలంగాణ అమరవీరులకు పూలమాలలతో నివాళులు అర్పిస్తూ ర్యాలీలో పాల్గొన్న జీసీ నాయకులు





**జగిత్యాల, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల పట్టణంలోని అమరవీరుల స్తూపం పార్కులో దొడ్డి కొమరయ్య పాన్ ఇండియా సినిమా వాల్ పోస్టర్‌ను జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె ర్యాలీగా బయలుదేరి కొత్త బస్టాండ్ సమీపంలోని తెలుగు తల్లి అంగడి బజార్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ అలిశెట్టి ప్రభాకర్‌లకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి విజయపురి కాలనీలోని దొడ్డి కొమరయ్య విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి ఆయనకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడువాల జ్యోతిలక్ష్మణ్ మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య పోరాటం త్యాగాలు తెలంగాణ చరిత్రలో ఆయన పాత్ర గురించి నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించేందుకు ఇటువంటి సినిమాలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య సినిమా డైరెక్టర్ సేనాపతి మానాల కిషన్ తుల రాజేందర్ హరి అశోక్ కుమార్ పిట్ట ధర్మరాజు ఏసిఎస్ రాజు దయాల మల్లారెడ్డి వొల్లెం మల్లేశం నారాయణ సింగం భాస్కర్ సింగం పద్మ బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ బతుకమ్మ పై పోలీసుల అవగాహన

ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్



**ముధోల్: 13అక్టోబర్(తెలంగాణ పత్రిక):** బతుకమ్మ పండుగను పురస్కరించుకొని కమ్యూనిటీ బతుకమ్మ కార్యక్రమంలో భాగంగా ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం ముధోల్ మండలంలోని ముద్గల్ గ్రామంలో కొనసాగుతున్న దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఎస్సై పాల్గొని దుర్గాదేవికి ప్రత్యేక పూజలను చేసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని పిల్లలకు వాహనాలు నడపడానికి ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, నిబంధన లు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్య లు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. యువత చెడు అలవా ట్లకు దూరంగా ఉంటూ చదువు పై దృష్టి సారించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై శ్రద్ధ వహిం చాలని కోరారు. గంజాయి విక్రయా లు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసినట్లయి తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం ఎస్సై బిట్ల పెర్సిస్ ను సర్పంచ్ మేకల అనురాధ – గణపతి, గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

## గజలాపురం గ్రామ పంచాయతీ ఎంపీడబ్ల్యూ వర్కర్ వేధింపులు గ్రామంలో ఎంపీవో విచారణ!

**మాడ్గులపల్లి//నల్గొండ//అక్టోబర్ 13: (తెలంగాణ పత్రిక)**



నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గజలాపురం గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ ఎంపీడబ్ల్యూ కుక్కముడి వెంకటయ్యను విధుల్లోకి రాకుండా అడ్డుకుంటూ, మానసిక వేధింపులకు గురిచేస్తున్నారనే ఫిర్యాదుపై మంగళవారం మండల పరిషత్ అధికారి ఎంపీవో గజలాపురం గ్రామంలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. గత 2019 నుండి నిబద్ధతతో పనిచేస్తున్న తనను సర్పంచ్ బ్రాహ్మల రోజా, ఉపసర్పంచ్ ఉగ్గిడి సత్యనారాయణ, వార్డ్ మెంబర్ సింగం కార్తీక్ మరియు పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ రెడ్డి లు కలిసి అక్రమంగా విధులకు దూరం చేశారని బాధితుడు అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. విచారణాధికారికి తన నియామక పత్రాలు, బ్యాంక్ ద్వారా పొందిన వేతనాల వివరాలు మరియు వేధింపులకు సంబంధించిన ఆధారాలను లిఖితపూర్వకంగా సమర్పించారు. తన కుటుంబానికి జీవనాధారమైన ఉపాధిని దూరం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తనకు తిరిగి గౌరవప్రదంగా విధులు నిర్వహించుకునేలా ఉత్తర్వులు జారీ చేయాలని వెంకటయ్య, అధికారులను కోరారు.

## ఆర్టీఐ చట్టం ప్రజలకు శక్తివంతమైన ఆయుధం

నర్మెట్టలో సమాచార హక్కు చట్టం ఆవిర్భావ వేడుకలు



**నంగునూరు, అక్టోబర్ 13(తెలంగాణ పత్రిక):** ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీ తనం పెంపొందించి అవినీతి రహిత సమాజ నిర్మాణానికి సమాచార హక్కు చట్టం ఎంతో దోహదపడుతుందని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి కట్ట ఎల్లయ్య అన్నారు. సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నంగునూరు మండలం నర్మెట్టలో సమాచార హక్కు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్ట ఎల్లయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పౌరులకు లభించిన అత్యంత శక్తివంతమైన హక్కుల్లో సమాచార హక్కు చట్టం ఒకటని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, ప్రజా సంస్థల పనితీరుపై సమాచారం తెలుసుకునేందుకు ఈ చట్టం ప్రజలకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను పెంచి, అధికారులను జవాబుదారీగా ఉంచేందుకు ఆర్టీఐ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని, తమ హక్కులను పరిరక్షించుకునేందుకు ఈ చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకతకు, అవినీతిని అరికట్టడానికి సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ ఒక ఆయుధంగా మలచుకోవాలని సూచించారు. సమాచార హక్కు చట్టం 2005 అక్టోబర్ 12 నుంచి అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. ఈ చట్టంపై ప్రజల్లో చైతన్యం కల్పించి దాని ప్రాధాన్యతను విస్తృతంగా ప్రచారం చేసేందుకు సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ నిరంతరం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చేర్యాల సాయి తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి జ్వాలా ట్రస్ట్ అండ

వృద్ధురాలి అంత్యక్రియల కోసం రూ.7,100 ఆర్థిక సాయం



**మంగపేట, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** ఆపదలో ఉన్న పేద కుటుంబానికి అండగా నిలిచి జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ మానవత్వాన్ని చాటుకుంది. మంగపేట మండలం కమలాపురం గ్రామంలోని పాతూరుకు చెందిన ఇండ్ల రామక్క అనే వృద్ధురాలు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు సైతం ఆర్థిక స్థోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు దాతల సహాయం కోరారు. ఈ విషయం తెలుసుకున్న జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు స్పందించి, దాతల సహకారంతో సేకరించిన రూ. 7,100 నగదును మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో ఆర్థిక సాయం అందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ మాట్లాడుతూ, వృద్ధురాలి కుటుంబ పరిస్థితిని జ్వాలా ట్రస్ట్ వాట్సాప్ సామాజిక మాధ్యమాల సమూహంలో తెలియజేయగానే పలువురు దాతలు స్పందించి సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ ఆపద సమయంలో సహకరించిన దాతలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత సహాయం అందించి మానవత్వాన్ని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నిమ్మల నరేష్, వేల్పుల శేఖర్, గంగుల చంటి, గోలి నరేష్, సాంబయ్య, బూర సాయి తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ



**పాలకుర్తి,అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** మెదక్ జిల్లాలో వీరనారి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి అని తెలంగాణ రజక వృత్తిదారులు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఏదునూరి మదార్, పైళ్ల ఆశయ్య మంగళవారం వారు ఒక ప్రకటనలో ఖండించారు. తెలంగాణ రాష్ట్రంలో మహనీయుల విగ్రహాలకు భద్రత లోపించిందిని, వీరనారి ఐలమ్మ విగ్రహాన్ని కూల్చిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ డిమాండ్ చేశారు . ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన చోట సీసీ కెమెరాల నిగా ఉన్నప్పటికీ పట్టించుకోక పోవడంలోని ఆంతర్యం ఏమిటో అని వారు ప్రశ్నించారు .రాష్ట్ర ప్రభుత్వం స్పందించని యెడల రాష్ట్ర వ్యాప్తంగా రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి






**ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్**

**పీపీపీ విధానంలో పర్యాటక రంగానికి**

**పెట్టుబడులను ఆకర్షించాలి**

**బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలి**

**మంజూరైన పర్యాటక అభివృద్ధి పనులను**

**వేగవంతం చేయాలి**

**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 13:** రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలని రాష్ట్ర యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ. వాణి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు, బతుకమ్మ వేడుకల నిర్వహణ, ప్రభుత్వ భూముల వినియోగం, పెండింగ్ పనుల పురోగతిపై సమీక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఐడీఓసీ సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఏ. వాణి ప్రసాద్ సూచించారు. అక్టోబర్ 18న హైదరాబాద్‌లోని సద్దుల బతుకమ్మ ట్యాంక్‌బండ్ కార్యక్రమంలో రాష్ట్రంలోని జిల్లాల పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతను ప్రతిబింబించేలా నాణ్యమైన వీడియోలను రూపొందించి పంపించాలని సూచించారు. పర్యాటక అభివృద్ధికి అనువైన ప్రభుత్వ భూములు, ప్రాంతాలను గుర్తించి పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అడ్వెంచర్ పార్కులు, వాటర్ స్పోర్ట్స్, జెట్టీలు, హోటళ్లు, రహదారి పక్కన రెస్టారెంట్లు, ఎకో కాటేజీలు, హెరిటేజ్ గ్రామాలు, కోటలు వంటి పర్యాటక ఆకర్షణలను అభివృద్ధి చేసేందుకు పెట్టుబడిదారులను ఆకర్షించాలని సూచించారు. ఇప్పటికే గుర్తించిన పర్యాటక ప్రాంతాలతో పాటు మరిన్ని ప్రాంతాలను గుర్తించి వాటి వివరాలను సమర్పించాలని తెలిపారు. మంజూరైన పర్యాటక అభివృద్ధి పనులను సంబంధిత ఇంజినీరింగ్ శాఖలకు అప్పగించి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సుమారు రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టే పనులకు జిల్లా అధికారులు లేదా తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (టీఎస్‌టీడీసీ) ఎంప్యానెల్ చేసిన కన్సల్టెంట్ల ద్వారా సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్‌లు) సిద్ధం చేయాలని సూచించారు. రెండు వారాల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, మంజూరైన పనుల వివరాలు, పురోగతిని నివేదికలు అందించాలన్నారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, కొత్తగూడెం, ఇల్లెందు, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న హరిత హోటళ్లను పీపీపీ విధానంలో 15 సంవత్సరాల నిర్వహణ లీజుకు ఇచ్చేందుకు పెట్టుబడిదారులను ఆకర్షించాలని సూచించారు. ఆలంపూర్‌లో యాత్రికుల సౌకర్య కేంద్రం నిర్వహణకు తగిన ఏజెన్సీని ఎంపిక చేయాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 50 చారిత్రక కట్టడాల పరిరక్షణకు మహిళా సమాఖ్య లేదా స్థానిక ఔట్‌సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించాలని సూచించారు. ఫణిగిరి బౌద్ధ స్థూపం, సోమేశ్వర ఆలయం వంటి చారిత్రక ప్రదేశాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో గుర్తించిన 142 ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలకు సంబంధించి కాఫీ టేబుల్ బుక్‌ను సమీక్షించి, మెరుగైన ఫొటోలు, వీడియోలు, ఆకర్షణీయమైన సమాచారాన్ని పంపించాలని, మరిన్ని పర్యాటక ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అనువైన ప్రాంతాలు, ప్రభుత్వ భూములను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించడంతో పాటు జిల్లాలోని పర్యాటక ప్రదేశాల విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పీపీపీ విధానంలో అభివృద్ధి చేయగల ప్రాంతాలను గుర్తించి పెట్టుబడి దారులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, చారిత్రక కట్టడాల పరిరక్షణతో పాటు పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీఆర్‌ఓ పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి అనూష, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కరాటే పోటీలకు కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల విద్యార్థి ఎంపిక



**తెలంగాణ పత్రిక కరీంనగర్ అక్టోబర్ 13:** శ్రీలంకలో ఈ నెల అనగా 2026 అక్టోబర్ 16, 17 తేదీలలో నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలకు కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలకు చెందిన కరాటే క్రీడాకారుడు కె. ఆదిత్య సాయి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీ క్రాంతి కుమార్ గారు, కరాటే కోచ్ శ్రీ ఆర్. ప్రసన్న కృష్ణ గారు ఆదిత్య సాయిని అభినందించారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణమని వారు పేర్కొన్నారు. క్రీడల పట్ల ఆసక్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఆదిత్య సాయి ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని తెలిపారు. కోచ్ ఆర్. ప్రసన్న కృష్ణ గారి శిక్షణ, మార్గదర్శకత్వంలో ఆదిత్య సాయి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను చాటుకుని, అద్భుతమైన ప్రదర్శనతో విజయం సాధించి పాఠశాలకు, మన దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆదిత్య సాయికి శుభాకాంక్షలు తెలియజేశారు. కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది ఆదిత్య సాయిని అభినందిస్తూ, పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## ఓమన్ దేశంలో ఆత్మహత్య చేసుకున్న బాధితుడికి 50 వేల ఆర్థిక సహాయం



**సారంగాపూర్, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల్ నాగునూరు గ్రామానికి చెందిన గంగాధర శ్రీకాంత్ ఇటీవల ఓమన్ గల్ఫ్ దేశంలో ఉపాధి కోసం వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. తన కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో చిన్న భిన్నం కావడంతో తన కుటుంబానికి చేదోడుగా అండగా నిలవాలని తెలుగు గల్ఫ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ కష్టకాలంలో ఆ కుటుంబానికి మనోధైర్యం కలిగిస్తూ తెలుగు గల్ఫ్ కమ్యూనిటీ వారు భగవంతుడిని ప్రార్థించారు. ఈ ఆర్థిక సహాయం అందజేసిన వారందరికీ గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పారిశుద్ధ కార్మికులకు దసరా కనుకగా దుస్తులను పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ బొప్పిడి గోపాల్



**కల్వకుర్తి అక్టోబర్ 13 తెలంగాణ పత్రిక:** కడ్తాల్ మండలం రావిచేడు గ్రామపంచాయతీ పరిశుద్ధ కార్మికులకు దసరా పండుగ కనుక దుస్తులు పంపిణీ చేశారు గ్రామ సర్పంచ్ బొప్పిడి గోపాల్ ఆయన మాట్లాడుతూ పరిశుద్ధ కార్మికులు కష్టపడి సమాజ అభివృద్ధికి కిల క భూమిక వహిస్తున్నారని అన్నారు గ్రామాన్ని పరిశుభ్రంగా ఆరోగ్యవంతంగా ఉంచడంలో పరిశుద్ధ కార్మికుల సేవలు ఎంతో కీలకమన్నారు వారు ఎండ న కా వాననక రెయిన్ బవల్లు కష్టపడి గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు దసరా పండుగకు వారికి దుస్తులు అందించడం ఎంతో సంతోషంగా ఉందని వారి సంక్షేమానికి గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు పరిశుద్ధ కార్మికులు ప్రతిరోజు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన పరిశుద్ధ సేవలు అందిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బందరి యాదయ్య వార్డు సభ్యులు మంజుల శోభ బొగురమ్మ గ్రామపంచాయతీ కార్యదర్శి తిరుపతి నాయక్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అక్కాచెల్లెళ్లకు అండగా అంబేద్కర్ యువజన సంఘం

కుటుంబ పెద్దను కోల్పోయిన నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత



**మంగపేట, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** ఆపదలో ఉన్న పేద కుటుంబానికి అండగా నిలిచి కోమటిపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. మంగపేట మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పులి భాస్కర్ ఇటీవల అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందారు. ఇప్పటికే తల్లిదండ్రులను కోల్పోయిన ఆ కుటుంబంలో భాస్కర్ మరణంతో ఒక అక్క, ఒక చెల్లి మాత్రమే మిగిలారు. కుటుంబానికి సంపాదించి పెట్టే దిక్కు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి పరిస్థితిని తెలుసుకున్న అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, సభ్యులు వెంటనే స్పందించారు. బాధిత కుటుంబానికి నగదు రూపంలో ఆర్థిక సహాయం అందించి తమ వంతు చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గారె విష్ణు వర్ధన్ మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వానికి నిజమైన నిదర్శనమని అన్నారు. భాస్కర్ కుటుంబం తీవ్ర దుఃఖంలో, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకొని తమ సంఘం తరఫున చిన్నపాటి సహాయం అందించామని తెలిపారు. సమాజంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, సభ్యులను గ్రామస్తులు, కుల సంఘం పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గారె విష్ణు వర్ధన్, కమిటీ సభ్యులు, కుల సంఘం పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆహార భద్రతా అధికారి ఆకస్మిక తనిఖీలు

గడువు ముగిసిన ఆహార ఉత్పత్తుల తొలగింపు

నిబంధనలు పాటించని వ్యాపారులకు నోటీసులు



**కామారెడ్డి, అక్టోబర్ 13, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)** కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలో ఆహార భద్రతా అధికారి జి. విక్రమ్ మంగళవారం పలు చిల్లర దుకాణాలు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొన్ని దుకాణాల్లో గడువు ముగిసిన ఆహార ఉత్పత్తులను గుర్తించి, వాటిని వెంటనే తొలగించి పారవేయించారు. నాణ్యతపై అనుమానం ఉన్న పలు ఆహార పదార్థాల నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. అలాగే, ఆహార భద్రతా ప్రమాణాల ప్రకారం అవసరమైన ఎఫ్‌ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేదా నమోదు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న పలు సంస్థలను గుర్తించి, సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆహార భద్రతా అధికారి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి ఆహార వ్యాపారి తప్పనిసరిగా ఎఫ్‌ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేదా నమోదు కలిగి ఉండాలని సూచించారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యంఎ ఆహార భద్రతా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## శ్రీగిరి పర్వతంపై వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

మహితాపూర్ కనకదుర్గాదేవికి 108 రకాల నైవేద్యాల సమర్పణ





**రాయికల్ మండల అక్టోబర్ 13(తెలంగాణ పత్రిక ):** జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని మహితాపూర్ గ్రామ సమీపంలోని శ్రీగిరి పర్వతంపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి 108 రకాల నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల నైవేద్యాలతో అమ్మవారిని పూజించడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో ప్రతిరోజూ అమ్మవారికి విశేష అలంకరణలు,పంచామృత అభిషేకం,శ్రీచక్ర సహిత నిత్య కుంకుమార్చన,మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 108 రకాల నైవేద్యాలను సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని,గ్రామం సుభిక్షంగా వర్ధిల్లాలని,ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు. భక్తులకు మాజీ జెడ్పీటీసీ గోపి మాధవిరాజిరెడ్డి అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బర్కం మల్లేష్,ఎలిగేటి అనిల్, మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంతతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో బతుకమ్మ సంబరాలు



**తానూర్: 13అక్టోబర్ (తెలంగాణ పత్రిక)**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో మంగళవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి రమ్య గౌడ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళా సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమ్య గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగను అందరూ ఐకమత్యంతో జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు,ఆశ కార్యకర్తలు, స్థానిక మహిళలు,పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు.. నిమజ్జన ఘాట్ల పరిశీలన!

ఆడపడుచులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పిస్తాం

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు





**మంగపేట, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన ఘాట్ల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కాంగ్రెస్ నాయకులు చర్యలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాలు, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు మంగపేట మండలంలోని చెరుపల్లి, తిమ్మంపేట గ్రామాల్లో చెరువుల కట్టల వద్ద నిమజ్జన ఘాట్ల ఏర్పాట్ల కోసం అనువైన స్థలాలను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే మహిళలకు కల్పించాల్సిన సౌకర్యాలు, చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆడపడుచుల సంక్షేమం, సౌకర్యాలకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు సంతోషంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయడం ముఖ్యమన్నారు. ప్రకృతిలో లభించే రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి సంప్రదాయబద్ధంగా జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. చెరువుల వద్ద నిమజ్జన ఘాట్ల ఏర్పాట్లకు అనువైన ప్రదేశాలను పరిశీలించి, మహిళలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాల కల్పనపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగపేట మండల ప్రజలకు, ముఖ్యంగా ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్, తిమ్మంపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు చిన్నపెల్లి రాంబాబు, చెరుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు దిద్ది లక్ష్మీ నరసయ్య, కాంగ్రెస్ నాయకులు శానం సత్యనారాయణ, ఆక సతీష్, దుర్గం శివప్రసాద్, దుర్గం బిక్షపతి, బొంబోతుల మురళి, గ్రామ కమిటీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర రాజు, బొలుగొడ్డు సందీప్, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ తాటి రమణకార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక



# కరువు కాటేసింది.. శాపం తెలంగాణకేనా?

- ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జలాలతో సస్యశ్యామలం • తెలంగాణలో మాత్రం పంటలు వేయొద్దంటున్న కాంగ్రెస్ సర్కార్! • ఎల్‌నినో సాకుతో రైతులకు ఆంక్షలా?
- తెలంగాణ జలాలు పక్క రాష్ట్రాలకు వెళ్తున్నాయన్న ఆందోళన • మన రైతులకు నీళ్లివ్వడంలో నిర్లక్ష్యమెందుకు? • నీటి నిర్వహణలో వైఫల్యానికి బాధ్యత ఎవరిది?

**తెలంగాణ పత్రిక ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబర్ 13:** తెలంగాణలో రైతన్నకు నీటి కష్టాలు.. పక్కరాష్ట్రంలో మాత్రం నీటి పారుదలతో పంటలకు భరోసా! అదే భరోసా తెలంగాణ రైతులకు ఎందుకు కల్పించడంలేదు? ఒకవైపు పంటలు వేయొద్దంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు రైతులకు సూచనలు చేస్తుంటే.. మరోవైపు అందుబాటులో ఉన్న జలాలను సమర్థంగా వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో రైతులను ముందుగానే అప్రమత్తం చేయడం అవసరమే. కానీ, ఆ పేరుతో పంటలు వేయొద్దని చెప్పడం తప్పు.. ప్రత్యామ్నాయ నీటి వనరులపై ప్రభుత్వం ఏం చేస్తోంది? ప్రాజెక్టుల్లో నీటిని నిల్వ చేయడం, నదీ జలాలను సద్వినియోగం చేసుకోవడం, సాగునీటి ప్రణాళికలు రూపొందించడం వంటి కీలక అంశాలపై స్పష్టత ఎక్కడ? ఇదే ఇప్పుడు తెలంగాణ రైతాంగాన్ని వేధిస్తున్న ప్రశ్న. మరోవైపు కృష్ణా, గోదావరి నదుల జలాల వినియోగం, అంతర్రాష్ట్ర నీటి పంపిణీ అంశాలు కూడా చర్చకు వస్తున్నాయి. తెలంగాణ పరిధిలోని నదుల నుంచి అందుబాటులో ఉన్న నీటిని రాష్ట్ర అవసరాలకు ఎంతవరకు వినియోగించుకుంటున్నారు? దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తున్న జలాల్లో ఎంత భాగాన్ని నిల్వ చేసుకునే అవకాశం ఉంది? రాష్ట్రంలోని ప్రాజెక్టులు, కాలువలు, ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటిని మరింత సమర్థంగా అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి? పక్క రాష్ట్రాల్లో నీటి సరఫరా పథకాలు ముందుకు సాగుతున్నాయన్న చర్చ జరుగుతున్న వేళ.. తెలంగాణ రైతులు మాత్రం సాగునీటి కోసం ఎందుకు ఎదురుచూడాల్సి వస్తోందన్న ప్రశ్నకు పాలకులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.





## ఎల్‌నినో ఒక్క తెలంగాణకే శాపమా?

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం అనేవి ఒక్క తెలంగాణ రాష్ట్రానికే పరిమితమైనవి కావు. దేశవ్యాప్తంగా వర్షపాతంపై వాటి ప్రభావం ఉండే అవకాశం ఉంది. అలాంటప్పుడు తెలంగాణలోనే రైతులకు పంటలు వేయొద్దనే పరిస్థితి ఎందుకు ఎదురవుతోంది? వర్షాలు తగ్గవచ్చన్న అంచనాలు ముందే ఉన్నప్పుడు, దానికి అనుగుణంగా సాగునీటి ప్రణాళికలు ఎందుకు సిద్ధం చేయలేదు? నీటి లభ్యతను అంచనా వేసి, పంటల ఎంపికపై రైతులకు ముందస్తు మార్గదర్శకత్వం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా? రైతులను హెచ్చరించడం ఎంత ముఖ్యమో.. వారి పంటలను కాపాడేందుకు కార్యాచరణ రూపొందించడం కూడా అంతే ముఖ్యం. వర్షాలు పడకపోతే రైతు నష్టపోతాడు. నీళ్లు లేక పంట ఎండిపోతే పెట్టుబడి నష్టపోతాడు. అప్పులు చేసి సాగు ప్రారంభించిన రైతుకు చివరికి మిగిలేది అప్పుల భారం మాత్రమే. ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వం ఏం చేస్తోంది? పంటలు వేయొద్దని చెప్పడం సులభమే.. కానీ రైతు కుటుంబం జీవనాధారాన్ని ఎలా కాపాడతారన్నదే అసలు ప్రశ్న. ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని ముందుగానే అంచనాలు వెలువడుతున్నప్పుడు.. నీటి లభ్యతపై సమగ్ర సమీక్ష నిర్వహించి, ప్రాజెక్టుల్లో నిల్వలు, భూగర్భజలాలు, చెరువులు, కుంటల పరిస్థితిని అంచనా వేయాల్సిన అవసరంలేదా? రైతులు ఏ పంటలు సాగు చేయాలి, ఎక్కడ ఎంత నీరు అందుబాటులో ఉంటుంది, నీటి కొరత ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏమిటి అనే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. ప్రకృతి పరిస్థితులను సాకుగా చూపించి రైతులపై బాధ్యతను నెట్టేయడం కాకుండా.. వారిని ఆదుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలి.

## ప్రాణహిత జలాలు గోదావరిలో కలుస్తుంటే..తెలంగాణకు ఉపయోగం ఏది?

గోదావరి బేసిన్‌లోని ప్రాణహిత వంటి ఉపనదుల నుంచి భారీగా నీరు ప్రవహించే సందర్భాలు ఉన్నాయి. ఆ నీటిలో ఎంత భాగాన్ని సాగునీటి అవసరాలకు మళ్లించవచ్చు? ఎంత నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంది? ఇప్పటికే ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నారా? కొత్త ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు, కాలువల నిర్వహణపై ప్రభుత్వం ఏ మేరకు దృష్టి సారించింది? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. అయితే, నదిలో నీరు ప్రవహిస్తోందని చెప్పి ఆ నీటినంతటినీ వెంటనే పొలాలకు మళ్లించడం సాధ్యం కాదు. ప్రాజెక్టుల సామర్థ్యం, భౌగోళిక పరిస్థితులు, పర్యావరణ అనుమతులు, అంతర్రాష్ట్ర ఒప్పందాలు వంటి అంశాలు కీలకం. అయినప్పటికీ, అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలించి, సాధ్యమైన మేరకు జలాలను వినియోగించుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నించాలి. నీరు ఉన్నప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకోలేక, కొరత వచ్చినప్పుడు రైతులకు ఆంక్షలు విధిస్తే పాలనలో ముందుచూపు ఎక్కడున్నట్లు? కృష్ణా, గోదావరి జలాల విషయంలోనూ ఇదే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ పరిధిలో ప్రవహించే నదుల జలాలను రాష్ట్ర అవసరాలకు ఎంతవరకు వినియోగించుకుంటున్నారు? ఎంత నీరు ప్రాజెక్టుల్లో నిల్వ ఉంటోంది? ఎంత దిగువకు ప్రవహిస్తోంది? నీటి కేటాయింపులు, ప్రాజెక్టుల నిర్వహణ, రాష్ట్రాల మధ్య ఒప్పందాల ప్రకారం ఎంత నీటిని వినియోగించుకునే అవకాశం ఉంది? ఈ వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాలి. నదుల్లో నీరు ప్రవహిస్తున్నా, రాష్ట్రంలోని సాగునీటి అవసరాలు తీరకపోతే.. అందుబాటులో ఉన్న జలాలను సద్వినియోగం చేసుకునే విషయంలో ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాల్సిన అవసరంలేదా? ప్రాణహిత, గోదావరి జలాలను సాధ్యమైన మేరకు నిల్వ చేసుకుని, సాగునీటి అవసరాలకు వినియోగించుకునేందుకు ఏ చర్యలు చేపట్టారు? ఎక్కడ ప్రాజెక్టులు అవసరం, ఎక్కడ కాలువల సామర్థ్యాన్ని పెంచాలి, ఎక్కడ ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని అందించవచ్చు అనే అంశాలపై ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందించాలి. నదుల్లోకి నీరు చేరిన తర్వాత అది దిగువకు ప్రవహించడం సహజమే. అయితే, తెలంగాణలోని రైతాంగానికి ఉపయోగపడే అవకాశాలను ముందుగానే పరిశీలించి, సాంకేతికంగా, ఆర్థికంగా సాధ్యమైన చోట నీటిని నిల్వ చేయడం, మళ్లించడం, పంపిణీ చేయడం ప్రభుత్వ బాధ్యత. నీటి లభ్యతపై స్పష్టమైన లెక్కలు వెల్లడించకుండా, రైతులకు పంటలు వేయొద్దని చెప్పడమే పరిష్కారమా? ఇదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## తెలంగాణ జలాలు పక్క రాష్ట్రాలకు.. మన రైతులకు మాత్రం కరువా?

తెలంగాణలో కృష్ణా, గోదావరి నదులు ప్రవహిస్తున్నాయి. ఈ నదుల పరివాహక ప్రాంతాల్లో అనేక ప్రాజెక్టులు, సాగునీటి పథకాలు ఉన్నాయి. అయినప్పటికీ, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జలాల వినియోగం, నీటి సరఫరా పథకాలపై చర్చ జరుగుతోంది. దీంతో తెలంగాణలో ఒక ప్రశ్న బలంగా వినిపిస్తోంది.. నదీ జలాలను సమర్థంగా వినియోగించుకోవడంలో మన ప్రభుత్వం ఎక్కడ వెనుకబడింది? తెలంగాణ నుంచి కృష్ణా, గోదావరి జలాలు దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తున్నప్పుడు, రాష్ట్ర అవసరాలకు ఉపయోగపడే నీటిని సాధ్యమైన మేరకు నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ఏం చేస్తోంది? తెలంగాణ రైతులకు సాగునీరు అందించేందుకు అందుబాటులో ఉన్న జలాలను మళ్లించే అవకాశాలపై సమగ్ర పరిశీలన జరిగిందా? ఇప్పటికే ఉన్న ప్రాజెక్టుల ద్వారా ఎంత నీటిని వినియోగించుకుంటున్నారు? అదనంగా నీటిని నిల్వ చేసుకునేందుకు ఏ చర్యలు చేపట్టారు? రాష్ట్రంలోని సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టుల నిర్వహణ, నీటి పంపిణీపై ఎలాంటి ప్రణాళిక అమలు చేస్తున్నారు? రాష్ట్ర పరిధిలోని జలాలు రాష్ట్ర రైతాంగానికి ఎంతవరకు ఉపయోగపడుతున్నాయన్న లెక్కలు ప్రజలకు తెలియాలి. నీటి కేటాయింపులు, అంతర్రాష్ట్ర ఒప్పందాలు, ప్రాజెక్టుల సామర్థ్యం వంటి అంశాలను పక్కన పెట్టి ఏ రాష్ట్రానికి ఎంత నీరు వెళ్తోందని నిర్ధారించడం సరైంది కాదు. కానీ తెలంగాణకు వినియోగించుకునే అవకాశం ఉన్న నీటిని కూడా సమర్థంగా వినియోగించుకోలేకపోతే దానికి బాధ్యత ఎవరిది? రైతులకు సాగునీరు అందించేందుకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని ప్రభుత్వం ఎందుకు పరిశీలించడం లేదు? ఇదే కీలకమైన ప్రశ్న. నీటి కొరతను ఎదుర్కొంటున్న ప్రాంతాలకు నీటిని అందించే మార్గాలను అన్వేషించడం, నదీ జలాల వినియోగంపై స్పష్టమైన విధానం రూపొందించడం, అవసరమైన చోట ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కేవలం వర్షాలపై ఆధారపడకుండా, అందుబాటులో ఉన్న నీటిని ఎలా వినియోగించుకోవాలో ప్రణాళిక రూపొందించాలి. పక్క రాష్ట్రాల్లో నీటి సరఫరా పథకాల గురించి చర్చ జరుగుతున్నప్పుడు, తెలంగాణలో రైతులకు మాత్రం నీటి కొరత ఎందుకు ఎదురవుతోందో ప్రభుత్వం వివరించాలి.

## పాలమూరు రైతులకు నీళ్ల కరువు.. కుప్పానికి కృష్ణా జలాలు ఎలా?

తెలంగాణలోని పాలమూరు ప్రాంతం దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తోంది. కృష్ణా బేసిన్‌లో ఉన్నప్పటికీ అనేక ప్రాంతాల్లో రైతులు సాగునీటి కొరతను ఎదుర్కొంటున్నారన్నది వాస్తవం. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం ప్రాంతానికి కృష్ణా జలాలను అందించేందుకు చేపట్టిన నీటి సరఫరా పథకాలపై రాజకీయ చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రైతుల్లో సహజంగానే కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎందుకు ఎదురవుతున్నాయి? ప్రాజెక్టులు, కాలువలు, ఎత్తిపోతల పథకాల ద్వారా రైతులకు నీటిని అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి? పక్క రాష్ట్రం తన అవసరాల కోసం నీటి సరఫరా పథకాలను ముందుకు తీసుకెళ్తుంటే, తెలంగాణలోని వెనుకబడిన సాగునీటి ప్రాంతాలకు భరోసా కల్పించడంలో జాప్యం ఎందుకు జరుగుతోంది? కుప్పానికి నీరు అందుతోందన్న అంశాన్ని మాత్రమే ఆధారంగా చేసుకుని తెలంగాణకు రావాల్సిన నీటిని ఆంధ్రప్రదేశ్‌కు మళ్లిస్తున్నారని నిర్ధారించలేం. రెండు రాష్ట్రాల నీటి కేటాయింపులు, ప్రాజెక్టుల సామర్థ్యం, నీటి తరలింపు మార్గాలు వేర్వేరు అంశాలు. అయినా, తమ రాష్ట్రంలోని రైతులకు సాగునీరు అందించడంలో తెలంగాణ ప్రభుత్వం ఎక్కడ వెనుకబడిందో ప్రజలకు వివరించాల్సిందే. పాలమూరు రైతు పొలానికి నీరు అందించలేని పరిస్థితి ఎందుకు కొనసాగుతోందో పాలకులు సమాధానం చెప్పాలి. పాలమూరు రైతు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నప్పుడు, కృష్ణా జలాలను సమర్థంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటో స్పష్టంగా తెలియజేయాలి. ఏ ప్రాజెక్టు ద్వారా ఎంత నీరు అందుతోంది? పెండింగ్‌లో ఉన్న పనులు ఎప్పుడు పూర్తవుతాయి? ఎత్తిపోతల పథకాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? సాగునీటి ప్రాజెక్టులపై ఖర్చు చేసిన నిధులకు అనుగుణంగా రైతులకు ప్రయోజనం అందుతోందా? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలి. కుప్పానికి నీరు అందించడం తప్పు అని చెప్పడం కాదు.. తెలంగాణలోని పాలమూరు సహా సాగునీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. పక్క రాష్ట్రాల్లో నీటి సరఫరా పథకాలు ముందుకు సాగుతున్నప్పుడు, మన రాష్ట్రంలోని రైతులకు సాగునీటి భరోసా కల్పించడంలో జాప్యం ఎందుకు జరుగుతోందన్నదే అసలు ప్రశ్న.

## కేసీఆర్ పాలనతో పోలిక.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

తెలంగాణలో సాగునీటి అంశం మరోసారి రాజకీయ వివాదానికి కేంద్రంగా మారింది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు, రైతుబంధు వంటి పథకాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ నాయకులు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు కరువు కష్టాలు పెరిగాయని, నీటి నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తున్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ రైతులకు అండగా నిలిచామని గత ప్రభుత్వ నాయకులు చెబుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం నీటి కొరతను ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా, ఇప్పుడు పంటలు వేయొద్దని చెబుతోందని వారు మండిపడుతున్నారు. అయితే, గత ప్రభుత్వ హయాంలోనూ సాగునీటి సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యాయని చెప్పలేం. ప్రాజెక్టుల నిర్మాణం, నీటి లభ్యత, సాగునీటి పంపిణీ, భూగర్భజలాల పరిస్థితి వంటి అంశాలను ఆధారాలతో పోల్చి చూస్తేనే ఏ ప్రభుత్వం ఎంతవరకు పనిచేసిందో స్పష్టమవుతుంది. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితిలో రైతులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వానిదే. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం కంటే, ప్రస్తుత సమస్యలకు పరిష్కారం చూపడమే ప్రజలు కోరుకుంటున్నది. గతంలో నిర్మించిన ప్రాజెక్టులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, నీటి నిల్వ సామర్థ్యం, సాగునీటి పంపిణీ వంటి అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలి. ఏ ప్రాజెక్టు ద్వారా ఎంత ఆయకట్టుకు నీరు అందుతోంది? ఎంత ఆయకట్టు ఇంకా నీటి కోసం ఎదురుచూస్తోంది? పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటి? కృష్ణా, గోదావరి జలాలను రాష్ట్ర అవసరాలకు మరింత సమర్థంగా వినియోగించుకునేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు? అనే అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. ప్రాజెక్టులపై రాజకీయ విమర్శలు చేయడం కన్నా, వాటి ద్వారా రైతులకు అందుతున్న ప్రయోజనాలను పెంచడం ముఖ్యం. గత ప్రభుత్వం చేసిన పనులపై సమీక్ష అవసరమే.. అదే సమయంలో ప్రస్తుత ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించకూడదు. నీటి కొరత ఏర్పడినప్పుడు రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, నీటి లభ్యతను పెంచేందుకు సాధ్యమైన అన్ని చర్యలు చేపట్టాలి.

## పంటలు వేయొద్దంటే రైతులు బతికేదెలా?

రైతు వ్యవసాయం చేయకపోతే అతని కుటుంబానికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది? పంటలు వేయకపోతే అప్పులు ఎలా తీర్చాలి? వ్యవసాయ కూలీలకు పని ఎలా దొరుకుతుంది? విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలపై ఆధారపడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎలా నిలబడుతుంది? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. నీటి లభ్యతను బట్టి తక్కువ నీటితో పండే పంటలను సూచించడం, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం, సాగునీటి షెడ్యూల్ ప్రకటించడం, చెరువులుకుంటలను పునరుద్ధరించడం, అందుబాటులో ఉన్న ప్రాజెక్టుల నుంచి నీటిని సమర్థంగా పంపిణీ చేయడం వంటి చర్యలు చేపట్టాలి. అవసరమైతే రైతులకు పరిహారం, పంటల బీమా, ప్రత్యామ్నాయ జీవనోపాధిపై కూడా స్పష్టమైన ప్రణాళిక ఉండాలి. రైతుకు పంట వేయొద్దని చెప్పే ముందు, పంట వేయకపోతే అతని కుటుంబాన్ని ఎలా ఆదుకుంటారో ప్రభుత్వం వివరించాలి. నీటి కొరతను ఎదుర్కొనేందుకు రైతులను ఒంటరిగా వదిలేయడం ఏ విధంగానూ సమంజసం కాదు. సాగునీరు అందుబాటులో లేని ప్రాంతాల్లో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై సూచనలు ఇవ్వడం అవసరమే. అయితే, నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో కూడా రైతులు సాగు చేయలేని పరిస్థితి ఎందుకు ఏర్పడుతోంది? ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని ఎక్కడెక్కడ వినియోగించుకోవచ్చు? నీటిని సమయానికి విడుదల చేయడానికి ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు? ఈ అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన సమాచారం అందించాలి. పంటలు వేయొద్దని చెప్పే ముందు రైతులకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలి. నీటి కొరత కారణంగా సాగు నిలిపివేయాల్సి వస్తే ఆర్థికంగా నష్టపోయే రైతులను ఎలా ఆదుకుంటారో ప్రకటించాలి. రైతు వ్యవసాయం చేయకపోతే అతని కుటుంబమే కాదు, వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణ ఉపాధి వ్యవస్థ కూడా ప్రభావితమవుతుంది. అందువల్ల సాగునీటి సమస్యను కేవలం వ్యవసాయ శాఖకు పరిమితం చేయకుండా, సమగ్ర గ్రామీణ ఆర్థిక సమస్యగా ప్రభుత్వం చూడాలి.

## నీటి నిర్వహణలో వైఫల్యమా? ముందుచూపు లేమా?

ప్రకృతి పరిస్థితులను ప్రభుత్వం పూర్తిగా నియంత్రించలేకపోవచ్చు. కానీ అందుబాటులో ఉన్న నీటిని ఎలా వినియోగించుకోవాలి? ఏ ప్రాంతానికి ఎంత నీరు అవసరం? ఏ పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి? వర్షాలు తగ్గితే ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి? అనే అంశాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించడం మాత్రం ప్రభుత్వ బాధ్యత. తెలంగాణలో నీటి కొరతకు ఎల్‌నినో ప్రభావమే కారణమని చెప్పడం ఎంతవరకు సమంజసం? వర్షపాతం తగ్గుదలతో పాటు ప్రాజెక్టుల నిర్వహణ, జలాల వినియోగం, భూగర్భజలాల పరిస్థితి, పంటల ఎంపిక వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. వాస్తవాలను ప్రజల ముందుంచి, నీటి లభ్యతపై స్పష్టమైన నివేదిక విడుదల చేయాలి. సాగునీటి ప్రణాళికను ప్రకటించాలి. రైతులకు భరోసా కల్పించాలి. అదే సమయంలో కృష్ణా, గోదావరి నదుల జలాల వినియోగంపై ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలన్న డిమాండ్ కూడా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. రాష్ట్రానికి అందుబాటులో ఉన్న నీటి కేటాయింపులు ఎంత? ప్రాజెక్టుల ద్వారా ప్రస్తుతం ఎంత నీరు వినియోగించుకుంటున్నారు? ఎంత నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది? ఏ ప్రాంతాలకు సాగునీరు అందుతోంది? ఏ ప్రాంతాలు ఇంకా వెనుకబడి ఉన్నాయి? రాష్ట్ర అవసరాలకు మరింత నీటిని వినియోగించుకునేందుకు ఉన్న అవకాశాలు ఏమిటి? అనే అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. నీటి కొరతను కేవలం వర్షాభావంతో ముడిపెట్టి చూడటం సరిపోదు. అందుబాటులో ఉన్న జలాల నిర్వహణ, ప్రాజెక్టుల సామర్థ్యం, సాగునీటి పంపిణీ, అంతర్రాష్ట్ర ఒప్పందాలు, భూగర్భజలాల వినియోగం వంటి అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలి. రాష్ట్ర రైతాంగానికి ప్రయోజనం చేకూర్చేలా నీటి విధానాన్ని అమలు చేయాలి.

## రైతులకు సూచనలు కాదు.. ప్రభుత్వానికి బాధ్యత కావాలి!

తెలంగాణ రైతులు కోరుకుంటున్నది ఉచిత హామీలు కాదు.. సాగు చేసుకునేందుకు అవసరమైన నీరు, పంటలకు గిట్టుబాటు ధర, నష్టపోకుండా ఉండే భరోసా. నదులు ప్రవహిస్తున్నా, ప్రాజెక్టులు ఉన్నా, రైతు పొలానికి నీరు చేరకపోతే ఆ వనరుల వల్ల ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఒకవైపు ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి పథకాలపై ముందడుగు పడుతున్నట్లు కనిపిస్తుంటే, మరోవైపు తెలంగాణలో రైతులు పంటలు వేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉండటం ఆందోళన కలిగించే అంశం. రాష్ట్రాల మధ్య నీటి లెక్కలు, కేటాయింపులు వేర్వేరైనా, తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత మాత్రం ఇక్కడి ప్రభుత్వానిదే. కృష్ణా, గోదావరి జలాలను రాష్ట్ర అవసరాలకు సమర్థంగా వినియోగించుకునే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. నీటిని నిల్వ చేసుకునే అవకాశాలు, సాగునీటి ప్రాజెక్టుల సామర్థ్యం, పెండింగ్ పనులు, కాలువల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థ వంటి అంశాలపై సమగ్ర సమీక్ష జరగాలి. సాధ్యమైన చోట నీటిని మళ్లించే ప్రణాళికలు రూపొందించి, సాగునీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. తెలంగాణ పరిధిలోని నదుల్లో నీరు ప్రవహిస్తుంటే.. ఆ నీటిని మన రైతులకు ఉపయోగపడేలా చేయడానికి ప్రభుత్వం ఏం చేస్తోంది? అందుబాటులో ఉన్న జలాలను రాష్ట్ర అవసరాలకు వినియోగించుకునే అవకాశాలు ఉన్నప్పుడు వాటిని ఎందుకు పూర్తిస్థాయిలో పరిశీలించడం లేదు? పక్క రాష్ట్రాల సాగునీటి పథకాల గురించి చర్చ జరుగుతున్నప్పుడు, తెలంగాణ రైతులకు కూడా అదే స్థాయిలో భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన అవసరం ఉంది. ఎల్‌నినోను సాకుగా చూపించి రైతులకు ఆంక్షలు విధించడమేనా పాలన? ప్రాణహిత, గోదావరి, కృష్ణా జలాలను సాధ్యమైన మేరకు సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం ఏం చేస్తోంది? పాలమూరు సహా సాగునీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలకు ఎప్పుడు పూర్తిస్థాయిలో నీరు అందుతుంది? పంటలు వేయొద్దని చెప్పే ముందు రైతుల జీవనాధారానికి ఏ భరోసా ఇస్తారు? రాష్ట్రానికి అందుబాటులో ఉన్న నీటి కేటాయింపులను సమర్థంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది? ఈ ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు చెప్పాలి. ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోవడం ప్రభుత్వానికి సాధ్యం కాకపోవచ్చు. కానీ వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించడం, రైతులను ఆదుకోవడం మాత్రం ప్రభుత్వ బాధ్యతే. తెలంగాణ రైతుకు కావాల్సింది సలహా కాదు.. సాగునీరు. హామీలు కాదు.. కార్యాచరణ. విమర్శలు కాదు.. పరిష్కారం!

**- పీట్ల శివకుమార్, సీనియర్ జర్నలిస్టు**

# బిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ కేటాయింపునకు అక్టోబర్ 16న లక్కీడ్రా

90 దరఖాస్తులు స్వీకరణ

జిల్లా ఆబ్కారీ అధికారి బి. ముకుంద రెడ్డి

**కామారెడ్డి, అక్టోబర్13, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**



కామారెడ్డి జిల్లాబిచ్కుంద మున్సిపాలిటీలో నూతన బార్ ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 12వ తేదీన ముగిసిందని జిల్లా ఆబ్కారీ అధికారి బి. ముకుంద రెడ్డి తెలిపారు. ఈ ప్రక్రియలో మొత్తం 90 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. బార్ కేటాయింపు ప్రక్రియను ఈ నెల 16వ తేదీన ఉదయం 11.00 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు తమకు అధికారులు జారీ చేసిన రసీదులతో అదే రోజు ఉదయం 10.00 గంటలకు కామారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లోని ప్రధాన సమావేశ మందిరానికి హాజరు కావాలని జిల్లా ఆబ్కారీ అధికారి సూచించారు.

# కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో అన్నపూర్ణ దేవిగా దర్శనం

**మిర్యాలగూడ ప్రతినిధి//అక్టోబర్ 13:(తెలంగాణ పత్రిక):**



మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ఈరోజు అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చినది ఈ సందర్భంగా ఆలయ నిర్మాణకర్త బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత 26 సంవత్సరాల నుండి గ్రామంలో భక్తి శ్రద్ధలతో శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహించుకుంటున్నామని వారు అన్నారు. దేవాలయంలో విధివిధానముగా శ్రీ మహాకాళి శ్రీ మహాలక్ష్మి శ్రీ మహా సరస్వతి త్రిమూర్త్యాత్మిక శ్రీ దుర్గా నవరాత్రులు భక్తిశ్రద్ధలతో భక్తులందరూ దేవి ప్రేరణచే జరుపుకోవాలని సంకల్పించి మనసా వాచా కర్మణా శ్రీ దుర్గాదేవిని సేవించి భక్తులందరూ తరించాల్సిందిగా కోరుతున్నామని వారన్నారు. గ్రామంలో పాడిపంట పశువులు శిశువులతో ఆయురారోగ్యాలతో కనక వస్తు వాహనాలతో అష్టైశ్వర్యాలతో అమ్మవారి అనుగ్రహంతో జనులందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఈ నవరాత్రులను గ్రామ ప్రజల అందరి సహకారంతో ఘనంగా నిర్వహించుకుంటున్నామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగాల సతీష్, మనీ, శివ, వెంకన్న, మహేషు, శివప్రసాద్ శివ రామ్ అంజి రమేషు అరుణ్, పాక మధు దంపతులు గువ్వల శివ దంపతులు దుండిగాల శివా దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ పై నుంచి కింద పడి గాయాలతో వ్యక్తి మృతి





**పాపన్నపేట, అక్టోబర్ 13:(తెలంగాణ పత్రిక)**

ట్రాక్టర్ పై నుంచి కింద పడి గాయాలతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గాజులగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు.. .గాజులగూడెం గ్రామానికి చెందిన పుట్టల సాయిలు(45) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకు ంటున్నాడు. సోమవారం సాయంత్రం సమయంలో ఇదే గ్రామానికి చెందిన ఇస్మాయిల్ తో కలిసి ట్రాక్టర్ తీసుకురావడానికి మండల పరిధిలోని ఎన్కేపల్లి వెళ్లి రాత్రి సమయంలో అక్కడ ఓ ఇంటి వద్ద ట్రాక్టర్ లో మట్టి నింపుకొని ఊరి బయటకు వస్తున్నారు. ఇస్మాయిల్ ట్రాక్టర్ నడుపుతుండగా సాయిలు పక్కన కూర్చున్నాడు. ఈ క్రమంలో అజాగ్రత్తగా నడపడంతో సాయిలు ట్రాక్టర్ పై నుంచి కింద పడగా ట్రాలీకి ఉన్న టైరు అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కుటుంబీకులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడు సాయిలు భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# యూసుఫ్ పేటలో ఘనంగా దేవి శరన్నవరాత్రు ఉత్సవాలు





**అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు**

**మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదానం**

**పాపన్నపేట, అక్టోబర్ 13:(తెలంగాణ పత్రిక):** పాపన్నపేట మండల పరిధిలోని యూసుఫ్ పేట ఈశ్వరాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సర్వజగత్తుకు అన్నాన్ని ప్రసాదించే అన్నపూర్ణాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తజన సందడితో కళకళలాడింది.

**అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు**

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజాము నుంచే ఆలయ మండపంలో అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. నీలం వర్ణ అలంకరణలో కొలువుదీరిన అన్నపూర్ణాదేవిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఓం శ్రీ అన్నపూర్ణాయై నమః అనే నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయ పూజారి రమేష్ శర్మ మాట్లాడుతూ.. అన్నపూర్ణాదేవిని భక్తిశ్రద్ధలతో దర్శించుకోవడం వల్ల కుటుంబాల్లో శాంతి, సౌఖ్యాలు, ధనధాన్య సమృద్ధి కలగాలని భక్తులు ఆకాంక్షిస్తారని తెలిపారు. అమ్మవారి కృపా కటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

**శశిధర్ రెడ్డి దంపతుల ప్రత్యేక పూజలు**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోల శశిధర్ రెడ్డి, సునీతమ్మ దంపతులు యూసుఫ్ పేట ఈశ్వరాలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం వారి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి దంపతులు మాట్లాడుతూ.. అమ్మవారి కృపా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

**అన్న ప్రసాద వితరణ దాతలకు ఘన సన్మానం**

మహా అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలు పట్లోల శశిధర్ రెడ్డి, సునీతమ్మ దంపతులను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద విత్తనాలు మహిళలు, చిన్నారులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. యూసుఫ్ పేట ఈశ్వరాలయంలో జరుగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతుండగా, ప్రత్యేక పూజలు, మహా అన్నదాన కార్యక్రమంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## నాలుగవ రోజు కూష్మాం డ అవాతారం

లెక్చరర్ఉమాశేషారావు వైద్య

**కామారెడ్డి, అక్టోబర్ 13,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**



కూష్మాండ అమ్మవారు నాలుగవస్వరూపం. నవ రాత్రులలో నాలుగవ రోజున అమ్మవారిని కూష్మాండ దేవిగా పూజిస్తారు. ఆమె సృష్టికి మూలశక్తిగా, సమస్త జగత్తుకు వెలుగును ప్రసాదించే ఆదిపరాశక్తిగా భక్తులు ఆరాధిస్తారు. చిన్నది లేదా స్వల్పమైనది. ఉష్మ వేడి లేదా తేజస్సు. అండ బ్రహ్మాండం లేదా విశ్వం. పురాణ సంప్రదాయం ప్రకారం, అమ్మవారు తన దివ్యమైన చిరునవ్వుతో అంధకారంలో ఉన్న విశ్వానికి వెలుగును ప్రసాదించి సృష్టిని ఆవిర్భవింప జేశారని చెబుతారు. అందుకే ఆమెకు కూష్మాండ దేవి అనే పేరు ప్రసిద్ధి చెందింది. ఎనిమిది చేతులు: అమ్మవారిని అష్టభుజాదేవిగా వర్ణిస్తారు. చేతులలో ఆయుధాలు, కమలం, అమృతకలశం వంటి వస్తువులు ఉంటాయని సంప్రదాయం.

**సింహవాహనం:** ధైర్యానికి, శక్తికి, అధర్మంపై విజయానికి ప్రతీక.

**దివ్య తేజస్సు:** సూర్యుని వంటి ప్రకాశంతో జగత్తుకు చైతన్యాన్ని ప్రసాదించే దేవిగా భావిస్తారు.

**అమృతకలశం:** ఆరోగ్యం, ఆయుష్షు, శ్రేయస్సుకు ప్రతీకగా భావిస్తారు.

కూష్మాండ అమ్మవారి భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల దైవానుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం

**ధ్యాన మంత్రం:** ఓం దేవ్యై కూష్మాండాయై నమఃవ . కూష్మాండ అమ్మవారి ప్రార్థన అమ్మా కూష్మాండా! జగత్తుకు వెలుగు ను ప్రసాదించే ఆదిశక్తీ! మా జీవితాల్లోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించు. మా కుటుంబానికి ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖశాంతులను అనుగ్రహించు. కష్టాలను ఎదుర్కొనే ధైర్యాన్ని, ధర్మమార్గంలో నడిచే బుద్ధిని ప్రసాదించు. సర్వలోకాలనూ కాపాడే జగన్మాతా, మమ్మల్ని ఎల్లప్పుడూ నీ కరుణాకటాక్షాలతో రక్షించు. అమ్మవారి పాదాలకు నమస్కారం

## ఎర్రబెల్లి ఆస్తులపై బహిరంగ చర్చకు రావాలి!!

**బీజేపీ రాష్ట్ర నాయకులు పాకానాటి దామోదర్ రెడ్డి.ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తులు దాచారంటూ తీవ్ర ఆరోపణ**

**కలెక్టర్‌ను కలిసి డబుల్ బెడ్రూమ్ స్థలాలు నావే అనడం విడ్డూరం**

**వచ్చే సోమవారం రాజీవ్ చౌరస్తాలో చర్చకు రావాలని సవాల్**



**పాలకుర్తి,అక్టోబర్ 13(తెలంగాణ పత్రిక):** పాలకుర్తి మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మండల అధ్యక్షులు మారం రవికుమార్ అధ్యక్షతన మండల ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకులు పాకానాటి దామోదర్ రెడ్డి మాట్లాడుతూ... మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తన ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను పూర్తిగా చూపలేదని దామోదర్ రెడ్డి ఆరోపించారు. గుర్తూరు ప్రాంతంలో 106 ఎకరాల భూమి ఉంటే,అఫిడవిట్‌లో కేవలం 26 ఎకరాలు మాత్రమే చూపించారని, మిగతా భూమి అంతా బినామీల పేర్లపై ఉందని విమర్శించారు. ఇటీవలే ఎర్రబెల్లి భూ కబ్జాలు చేసినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానని అన్నారని,కబ్జాలు చేయలేదని నిరూపించి రాజకీయ సన్యాసం చేసే దమ్ముందా అని ప్రశ్నించారు. పాలకుర్తి,దేవరుప్పుల, కొడకండ్ల పరిధిలో ఉన్న భూముల ల్యాండ్ టైటిల్ మార్చకుండా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలు ఎందుకు చేపట్టారని నిలదీశారు. అప్పుడు అధికారంలో ఉన్న కలెక్టర్ ఎందుకు అభ్యంతరం చెప్పలేదని, ఇప్పుడు మాత్రం ఆ స్థలాలు అన్నీ తనవే అని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అలాగే స్త్రీనిధి పథకానికి సంబంధించిన రూ. 5 కోట్ల ప్రజాధనాన్ని ఏం చేశారని ప్రశ్నిస్తూ, ఆ వివరాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. ఈ అంశాలపై ఆధారాలతో సహా వచ్చే సోమవారం రాజీవ్ చౌరస్తాలో బహిరంగ చర్చకు రావాలని ఎర్రబెల్లి దయాకర్ రావుకు ఆయన సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దొంగరి మహేందర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవి, కమ్మగాని శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి పెనుగొండ సోమేశ్వర్, మండల ఉపాధ్యక్షులు పబ్బ సంతోష్, మామిండ్ల వెంకన్న, మచ్చ సునీల్, కాసోజు సమ్మయ్య చారి, సునావత్ శంకర్ నాయక్, దేవసాని కృపాకర్, కృష్ణ రెడ్డి, రావుల, బొచ్చు సురేష్, అనిల్, చిక్కుడు అశోక్, మొగిలి వంశీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐసిసి అధ్యక్షులు కార్గేను కలిసిన షబ్బీర్ అలీ



**కామారెడ్డి ,అక్టోబర్ 13, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే ని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ వ్యవహారాల గురించి చర్చించారు.

## దొడ్డి కొమరయ్య సినిమా వాల్ పోస్టర్ ఆవిష్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్

**మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడంలో సినిమాలు కీలక పాత్ర పోషిస్తాయి**





**జగిత్యాల అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** జగిత్యాల పట్టణంలో తెలంగాణ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిస్తున్న సినిమా వాల్ పోస్టర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం రైతాంగ హక్కుల కోసం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం త్యాగం చిరస్మరణీయమని అన్నారు. ఆయన ధైర్యసాహసాలు పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. మహనీయుల జీవిత చరిత్రలను సినిమాల రూపంలో ప్రజలకు ముఖ్యంగా యువతకు పరిచయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి చిత్రాల ద్వారా మన చరిత్ర అమరవీరుల త్యాగాలు భావితరాలకు చేరుతాయని అన్నారు. దొడ్డి కొమురయ్య గారి జీవిత చరిత్రను వెండి తెరపై ఆవిష్కరిస్తున్న చిత్ర దర్శక నిర్మాతలకు చిత్ర బృందానికి అభినందనలు తెలియజేస్తూ ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద దొడ్డి కొమురయ్య గారికి నివాళులర్పించారు. నిర్వహించిన ర్యాలీలో పాల్గొని తెలంగాణ తల్లి సర్దార్ వల్లభభాయ్ పటేల్ దొడ్డి కొమురయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య సినిమా డైరెక్టర్ సేనాపతి కౌన్సిలర్లు సుంకేటి మమత, రామకృష్ణరెడ్డి పిట్ట ధర్మరాజు ప్రశాంత్ రావు, నిర్వాహకులు మానాల కిషన్, గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్, హరి అశోక్ కుమార్, విజయ్, ఏసీఎస్ రాజు, వొళ్ళెం మల్లేశం, సింగం భాస్కర్, వివిధ కుల సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి : (తెలంగాణ పత్రిక) అక్టోబర్ 13:** జయ శంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఎన్ హెచ్ ఎం జేఏసీ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ మిషన్ ( ఎన్ హెచ్ ఎం )కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొని ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర,మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్ హెచ్ ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు వైద్య సేవలందించిన వారి సేవలను ప్రభుత్వం గుర్తించి, తగిన గౌరవం కల్పించాలని కోరారు. ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా, వారితో చర్చలు జరిపి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారత రాష్ట్ర సమితి తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని సమస్యలు పరిష్కారమై ఉండవచ్చని, మరికొన్ని పరిష్కారం కాకపోయి ఉండవచ్చు, గతంలో పరిష్కారం కాని సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వంపై నెపం నెట్టి సమస్యల నుంచి తప్పించుకోవడం సరైన విధానం కాదని హితవు పలికారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ న్యాయం జరగాలని, వేతనాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిశీలించి సమాన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న వైద్య సిబ్బంది సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వారి డిమాండ్లను నెరవేర్చి, ఉద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఆడపడుచుల గుండెచప్పుడు బతుకమ్మ

**జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి,అదనపు కలెక్టర్ డా.కిరణ్మయి**

**బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ**



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** ఆడపడుచుల గుండెచప్పుడు బతుకమ్మ అని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణరెడ్డి,అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ నారాయణరెడ్డి మాట్లాడుతూ,తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందని తెలిపారు. మహిళల ఐక్యతకు,ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా జరుపుకోవాలని,బతుకమ్మ వేడుకల్లో అందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టీజీఓల సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ శ్రీమతి రేవతి మాట్లాడుతూ, ఈ నెల 14వ తేదీన టీజీఓ భవన్,నాంపల్లి, హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 15వ తేదీన రంగారెడ్డి జిల్లా ఐడీఓసీ ప్రాంగణంలో జిల్లా స్థాయి బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని,తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ వైభవాన్ని చాటుతూ,బతుకమ్మ పండుగ వేడుకలను ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకోవాలని మహిళా ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని,బతుకమ్మ పండుగ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష,కార్యదర్శులు డా.కె. రామారావు,శ్రీనేష్ కుమార్ నోరి,రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ శ్రీమతి రేవతి,కేంద్ర మహిళా విభాగం కోశాధికారి శ్రీమతి శాంతిశ్రీ,డి. సైదమ్మ,బాలేశ్వరి,రాణి,రాకేష్,మహేష్,ఐశ్వర్య, స్వప్న,సంధ్య,జ్యోత్స్న,ప్రమీల,లావణ్య,స్వాతి,పద్మాంజల,సమంత,శ్రీదేవి,మైతిలి,రాజ్యలక్ష్మి,రజిత,కరుణ,రవాణి,భాను,పుల్లమ్మ,ప్రశాంతి,మమత,శ్రీలత,భవాని తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేట ఉపసర్పంచ్ శ్రీనివాసరావుకు ఘన సన్మానం



**తెలంగాణ పత్రిక దమ్మపేట అక్టోబర్ 13:** దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గాంధీ బొమ్మ కూడలిలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో దమ్మపేట ఉపసర్పంచ్ ఆంబోతు శ్రీనివాసరావును ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యుడు దారా దుర్గాప్రసాద్ (డీపీ) శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు రూపా రాంబాబు, పాత్రికేయులు గుల్లా రాంబాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ నియోజకవర్గంలో పలు శుభకార్యాల్లో పాల్గొన్న యువ నాయకులు బత్తుల సాయి



**మిర్యాలగూడ ప్రతినిధి// అక్టోబర్ 13: (తెలంగాణ పత్రిక):**
మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో నిర్వహించిన పలు శుభకార్యాల్లో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తనయులు, యువ నాయకులు బత్తుల సాయి ప్రసన్న కుమార్ పాల్గొన్నారు. మొదట మిర్యాలగూడ పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన గ్యార్మీ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మిర్యాలగూడ మండలం జాటావత్ తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఇళ్లను ప్రారంభించారు. తదుపరి హాట్యా తండాలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకి ఎంతగానో ఉపయోగపడుతున్న అని అన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైనీ కలిసిన యాదవ సంఘం నాయకులు



**ఇల్లంతకుంట అక్టోబర్ 13 తెలంగాణ పత్రిక:** మండల కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సంఘం మండల కమిటీ సభ్యులు స్థానిక ఎస్సై ఉపేంద్ర చారి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు మండల అధ్యక్షులు ఓరుపుల రాములు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పయావుల బాలరాజు, ప్రధాన కార్యదర్శి బోలవేణి అజయ్, కార్యదర్శి జుర్ర రాజయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి కేశవేని శ్రీనివాస్, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు మల్యాల రాజశేఖర్ యాదవ్, సీనియర్ నాయకులు మల్యాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు నాసిరకం పురుగు మందుల నిషేధం

**హైదరాబాద్ :** రాష్ట్రంలో నాణ్యత లేని నాలుగు పురుగు మందులను నిషేధిస్తూ వ్యవసాయశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని ఉత్పత్తి, నిల్వ చేయరాదని, ఎక్కడా విక్రయించరాదని ఆదేశించింది. రైతులు సైతం వాటిని కొనుగోలు చేయరాదని కోరింది. మా అగ్రిసర్వీసెస్‌కు చెందిన టిముర్, సినర్జీ ఆగ్రోకెమికల్స్ సంస్థ ఉత్పత్తి చేసిన సింక్రోన్, కోరమాండల్ ఇంటర్నేషనల్‌కు చెందిన ప్రొలాజ్, వివా క్రాప్ సైన్సెస్ ఇండియా సంస్థకు చెందిన క్లోరోబాన్ పురుగుమందులు నాసిరకంగా ఉన్నాయని, తెగుళ్ల నియంత్రణకు పనిచేయడం లేదని వ్యవసాయశాఖకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నాలుగు మందులు నాణ్యత లేనివిగా శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

# సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు దసరా కానుక

**ఒక్కొక్కరికి రూ.1,53,912 లాభాల వాటా**

**38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి**

**29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు**

**రూ.5,500 బోనస్**

**సింగరేణి కార్మికుల సొంతింటి కలను**

**సాకారం చేస్తాం**

**పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలకు**

**15 రోజుల్లో పరిష్కారం**

**కార్మికుల సమస్యల పరిష్కారానికి**

**మానవీయ దృక్పథం**

**సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాక్‌లు**

**ప్రజాభవన్‌లో మీడియాతో ప్రకటించిన**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.**

**సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్**

**ఇప్పుడు పోరుబాట హాస్యాస్పదం:**

**మంత్రి శ్రీధర్‌బాబు**

**పదేళ్లు అధికారంలో ఉండి సమస్యలు**

**పరిష్కరించని వారు ఇప్పుడు ఏం సాధిస్తారు?**



**భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక అక్టోబర్ 13:** సింగరేణి బొగ్గు గని కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ. 1,53,912 చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రజాభవన్‌లో మంగళవారం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఈ నిర్ణయంతో ప్రయోజనం పొందనున్నారని, 29717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన 1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే 596 కోట్ల రూపాయలను లాభాల వాటాగా కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ. 5,500 బోనస్ అందించామని, ఈ ఏడాది కూడా అదే మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించినట్లు వివరించారు.

**సింగరేణి ఉద్యోగ, కార్మికులకు సొంతింటి కల సాకారం**

"సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేస్తాం. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలి. మిశ్రమ ఆర్థిక విధానాలను ప్రోత్సహించి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించాం. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన 5,774 ఎకరాల భూముల్లో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పట్టాల రూపంలో అందించారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని" సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించామని తెలిపారు. సింగరేణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 136 నుంచి గరిష్ఠంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని, ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఆయా ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి, వీలైనంత ఎక్కువ మంది కార్మికులకు ప్రయోజనం కలిగేలా మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరుకాక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని మానవీయంగా వ్యవహరించాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. సింగరేణి కార్మికులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సేఫ్టీ కిట్స్ తప్పనిసరిగా పంపిణీ చేయాలని, కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదన్నారు. సింగరేణి ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగానే కార్మికుల పెర్క్స్, అలవెన్స్ లపై ఆదాయపన్నును కూడా సంస్థ తరఫున ప్రభుత్వానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు వెల్లడించారు. "సింగరేణి అధికారులు, జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ ఆక్రమిత నివాస ప్రాంతాల్లో నివసిస్తున్న వారి ప్రాథమిక జాబితాను సిద్ధం చేస్తుంది. స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన లబ్ధిదారుల సమగ్ర జాబితాను రూపొందిస్తాం. ఈ ప్రక్రియను నెల రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించాం. సింగరేణి పరిధిలోని ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దుతాం. సామాన్య కార్మికుడు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి ఆసుపత్రుల్లోనే అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. అవసరమైతే వైద్యుల వేతనాలు, పారితోషికాలను పెంచి నిపుణులైన వైద్యులను నియమిస్తాం. అత్యవసర వైద్యం కోసం కార్డియాక్, క్యాథ్ ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని" వెల్లడించారు. బొగ్గు గనులు, ఓవర్‌బర్డెన్ డంప్‌ల దుమ్ము వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి పరిధిలోని పాత జిల్లాల్లో ప్రతి గ్రామానికి వెళ్లి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నరు. కార్మికులతోపాటు వారి కుటుంబాలు, స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. అధికారులకు పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ)ను చెల్లించేలా యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచాలని, ఖరీదైన పట్టణ, వాణిజ్య భూములను సోలార్ ప్లాంట్లకు వినియోగించకుండా, పట్టణాలకు వెలుపల ఉన్న నిరుపయోగ భూములు, ఓవర్‌బర్డెన్ గుట్టలను ఇందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలతోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. వాటి నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు సింగరేణి నుంచి స్థలం కేటాయించే అంశాన్ని పరిశీలించాలని, ఇందుకు బదులుగా రెవెన్యూ భూముల్లోని నిరుపయోగ గుట్టల భూములకు సంబంధించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలులో భాగంగా రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. సత్తుపల్లి, భూపాలపల్లి నియోజకవర్గాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తామన్నారు. సింగరేణి సంస్థను అభివృద్ధి చేయడంతోపాటు కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత, ఆరోగ్యం, గృహవసతి వంటి అంశాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతాం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

**సింగరేణి లాభాలు తగ్గడానికి కారణాలివే**

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సింగరేణి లాభాలు తగ్గడానికి పలు కారణాలున్నాయని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యంగా గత పదేళ్లలో కొత్త బొగ్గు బ్లాక్‌లను అదనంగా సాధించడంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనకుండా చేయడం వల్ల సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆరోపించారు. సుమారు 141 బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియలో సింగరేణి పాల్గొనే అవకాశాన్ని వినియోగించుకోలేదని, దీంతో సంస్థ వ్యాపార విస్తరణకు ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు. మరోవైపు ఇప్పటికే ఉన్న బొగ్గు బ్లాక్‌లలో కొన్ని మూతపడుతుండటంతో ఉత్పత్తి, ఆదాయంపై ప్రభావం పడుతోందన్నారు. దాదాపు 14 బ్లాక్‌లు మూతపడిన నేపథ్యంలో వాటి స్థానంలో కొత్త బ్లాక్‌లను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

**కొత్త బ్లాక్‌ల సాధనకు ప్రజా ప్రభుత్వం చర్యలు**

సింగరేణి సంస్థను బలోపేతం చేసేందుకు తమ ప్రభుత్వం కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనపై దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం దిగిపోయిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్త బ్లాక్‌లను సాధించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. తాడిచెర్ల–2, కోయగూడెం బ్లాక్ –3, మణుగూరు పీకే ఓసీ–2 డిప్ సైడ్ బ్లాక్, నైని వంటి బ్లాక్‌లను ప్రస్తావిస్తూ, కొత్త బ్లాక్‌ల సాధనతో పాటు సంస్థ వ్యాపారాన్ని విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఏ మైనింగ్ సంస్థ అయినా నిరంతరం కొత్త బ్లాక్‌లను సాధిస్తూ వ్యాపారాన్ని విస్తరించుకుంటేనే దాని ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల భవిష్యత్తు, సంస్థ మనుగడ, బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పెంపు దృష్ట్యా ఈ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

**మార్కెట్‌కు అనుగుణంగా బొగ్గు ధరల సర్దుబాటు**

ప్రస్తుతం బొగ్గు మార్కెట్‌లో తీవ్రమైన పోటీ నెలకొందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. మహానది, కోల్ ఇండియా, వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ వంటి సంస్థల నుంచి బొగ్గు సరఫరా అవుతోందని, ప్రైవేటు సంస్థలు కూడా తక్కువ ధరలకు బొగ్గును అందిస్తున్నాయని వివరించారు. సింగరేణి బొగ్గు ధరలు అధికంగా ఉండటంతో కొన్ని సంస్థలు ఇతర వనరుల నుంచి బొగ్గు కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మార్కెట్ ధరలకు అనుగుణంగా సింగరేణి బొగ్గు ధరలను హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ధరలను సర్దుబాటు చేయకపోతే బొగ్గు కొనుగోలుదారులను కోల్పోయే ప్రమాదం ఉందని, తద్వారా సంస్థ ఆదాయం మరింత తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణి ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతూనే మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.

**విద్యుత్ సంస్థల బకాయిలపై స్పందన**

సింగరేణికి విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన బకాయిల అంశాన్ని కూడా భట్టి విక్రమార్క ప్రస్తావించారు. గత పదేళ్లలో సుమారు రూ. 29 వేల కోట్ల బకాయిలు పేరుకుపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లలో సుమారు రూ. 27 వేల కోట్ల బకాయిలు ఉన్నట్లు వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల నుంచి సింగరేణికి రావాల్సిన మొత్తాలను క్రమంగా చెల్లించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను ఒక్కసారిగా చెల్లించడం సాధ్యం కాకపోయినా, వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. బకాయిలు ఎప్పుడు పేరుకుపోయినా, వాటిని చెల్లించాల్సిన బాధ్యత సంబంధిత సంస్థలపై ఉంటుందని స్పష్టం చేశారు.

**కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

సింగరేణి కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడంతోపాటు సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధన, మార్కెట్‌కు అనుగుణంగా ధరల సర్దుబాటు, బకాయిల వసూలు వంటి అంశాలపై సమగ్రంగా దృష్టి సారిస్తున్నామని తెలిపారు. సింగరేణి ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి సంస్థను మరింత పటిష్ఠంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. దసరా సందర్భంగా కార్మికులకు లాభాల వాటా, కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ప్రకటించడం వారి సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.

**సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్.. ఇప్పుడు పోరుబాట హాస్యాస్పదం:** మంత్రి శ్రీధర్‌బాబు

పదేళ్లు అధికారంలో ఉండి సమస్యలు పరిష్కరించని వారు ఇప్పుడు ఏం సాధిస్తారు? సింగరేణి సంస్థను పదేళ్ల పాటు అధికారంలో ఉండి నిర్వీర్యం చేసి, భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు పోరుబాట పేరుతో ఆందోళనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి పరిష్కరించలేని సమస్యలను ప్రతిపక్షంలో ఉండి ఎలా పరిష్కరిస్తారో మాజీ మంత్రి హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి సంస్థకు చేసిన మేలేమిటో, కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించలేక పోయిందో ముందుగా పోరుబాటలో వివరించాలని శ్రీధర్‌బాబు సూచించారు. కార్మికుల సమస్యలపై ఇప్పుడు ఆందోళనలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు.. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు స్పందించలేదో ప్రజలకు చెప్పాలని అన్నారు. మారుపేర్ల సమస్యను పదేళ్ల పాలనలో ఎందుకు పరిష్కరించలేకపోయారని ప్రశ్నించారు.

**కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం**

సింగరేణి సంస్థను కాపాడటంతోపాటు కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మంత్రి తెలిపారు. కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. మారుపేర్ల సమస్య పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీసుకున్న సానుకూల నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. డిస్మిస్డ్ ఉద్యోగుల సమస్యలతోపాటు కార్మికులకు సంబంధించిన పలు సంక్షేమ అంశాలపై నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. శాశ్వత ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థలను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని శ్రీధర్‌బాబు చెప్పారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు అవసరమైన శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు ప్రేం సాగర్ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కోరం కనకయ్య, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, మాలోతు రాందాస్ నాయక్, గండ్ర సత్యనారాయణ రావు, విజయరామారావు, ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, లాభాల వాటాను ప్రకటించడం పట్ల ఎమ్మెల్యేలు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులను శాలువా కప్పి సత్కరించారు.

## అమ్మవారికి నిత్య పూజలో ఉపయోగించే ఇత్తడి పాత్రలు అందజేత



**కామారెడ్డి, అక్టోబర్ 13,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని శ్రీ చాముండేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా దేవాలయంలో నిత్యం పూజ కార్యక్రమం లో ఉపయోగించే ఇత్తడి నైవేద్య పాత్ర, ఇత్తడి సింహ హారతి, పంచ హారతి, అమ్మవారికి పల్లకి సేవకు ఉపయోగించే చత్రము దోమకొండ వాస్తవ్యులు శ్రీ పన్యాల రాంమోహన్ రెడ్డి రమ దంపతులు సమర్పించారు వారికి శ్రీ చాముండేశ్వరి దేవి ఆశీస్సులు కలుగుగాక శతమానం భవతి ఆలయ కమిటీ చైర్మన్ వారికి శాలువా కప్పి సత్కరించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ధర్మకర్తలు ప్రముఖులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల ( సమస్యలు పరిష్కరించాలి

దసరా తర్వాత రాష్ట్రవ్యాప్త ఉద్యమం: సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్ :** విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యంపై దసరా తర్వాత ఉద్యమం చేపట్టనున్నట్లు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. "పీఆర్సీని వెంటనే ప్రకటించాలి. విశ్రాంత ఉద్యోగులకు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యానికి అనుమతివ్వాలి. ఉద్యోగ విరమణ తర్వాత వచ్చే ప్రయోజనాలు కల్పించాలి. వారిపై ఆధారపడి ఉన్న తల్లిదండ్రులు, అత్తమామలు, ఒంటరి ఉద్యోగులకు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునేందుకు చెల్లుబాటయ్యేలా ఆరోగ్య కార్డులు ఇవ్వాలి. సీఎం చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలి" అని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, నేతలు పాల్గొన్నారు.

## సంక్షేమ, గురుకుల వసతి గృహాలకు గుడ్ల సరఫరా టెండర్ల సాంకేతిక బిడ్ల పరిశీలన పూర్తి

కామారెడ్డి జిల్లా కలెక్టర్



**కామారెడ్డి ,అక్టోబర్ 13,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లాలోని సంక్షేమ, గురుకుల వసతి గృహాలకు గుడ్ల సరఫరా చేసేందుకు నిర్వహించిన టెండర్లలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన మంగళవారం సాంకేతిక బిడ్ల పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి, సంబంధిత కమిటీ సభ్యులు పాల్గొన్నారు. టెండర్లలో పాల్గొన్న సంస్థలు, సరఫరాదారులు సమర్పించిన సాంకేతిక బిడ్లు, సంబంధిత ధ్రువపత్రాలను నిర్దేశిత అర్హత ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు కమిటీ క్షుణ్ణంగా పరిశీలించింది. తదుపరి టెండర్ల ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని అన్ని సంక్షేమ, గురుకుల వసతి గృహాలకు గుడ్ల సరఫరా ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## ఆర్టీసీ ఎన్నికల ఫలితాలపై ఈయూ తప్పుడు ప్రచారం

భారాస డబ్బులు పంచింది: టీడబ్ల్యూయూ ఆరోపణ

**హైదరాబాద్ :** ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో 90% ఓట్లు వచ్చినట్లు ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) తప్పుడు ప్రచారం చేసుకుంటోందని, ఈయూ కూటమికి 52%, టీడబ్ల్యూయూ కూటమికి 48% ఓట్లు వచ్చాయని తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్(టీడబ్ల్యూయూ) అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇ. అశ్వత్థామరెడ్డి స్పష్టంచేశారు. కాంగ్రెస్ బలపర్చిన టీడబ్ల్యూయూను ఓడించేందుకు భారాస రాష్ట్రవ్యాప్తంగా డబ్బులు పంపిణీ చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని అప్రతిష్ఠ పాలుచేసేందుకు కొన్ని డిపోల్లో భారాస, భాజపా నేతలు ఈయూ కూటమి విజయానికి పరోక్షంగా మద్దతు ఇచ్చారన్నారు. మంగళవారం దేశోద్ధారక భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. "ఆర్టీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని ప్రచారం చేయడం తగదు. ఈ ఎన్నికలకు, కాంగ్రెస్‌కు సంబంధం లేదు. ఆర్టీసీ కార్మికుల హక్కులు, భద్రత కోసం టీడబ్ల్యూయూ నిరంతరం పోరాడుతుంది" అని పేర్కొన్నారు.

## శ్రీ సర్వదేవ పరంజ్యోతి భగవతి ఆలయంలో అన్నప్రసాద వితరణ

వేలాది మంది ఆకలిని తీర్చుతున్న అన్న ప్రసాద కార్యక్రమం



**కామారెడ్డి, అక్టోబర్ 13, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కల్కి నగర్ లో గల ఈ సర్వదేవ పరంజ్యోతి భగవతి ఆలయం కల్కి ఆలయంలో 2016 నుండి ప్రతి మంగళవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని ఆలయ సేవకులు ఎర్రం చంద్రశేఖర్,డాక్టర్ బాలు తెలియజేయడం జరిగింది. ఈ రోజు ఆలయంలో జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఆలయ సేవకులు ఎర్రం చంద్రశేఖర్,డాక్టర్ బాలు మాట్లాడుతూ వేలాదిమందికి ఆకలిని తీర్చే మహా యజ్ఞంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వేయి యజ్ఞాల పుణ్యఫలితం అన్న ప్రసాద వితరణతో కలుగుతుందని దాతలు ఈ కార్యక్రమానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యుల పుట్టినరోజు,పెళ్లి రోజు సందర్భంగా అన్నదానానికి దాతలు ముందుకు రావాలని అన్నారు అన్నదానం చేయాలనుకునే దాతలు 9849601438 నెంబర్ సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు ఎర్రం నారాయణ,కొమిరిశెట్టి దిగంబర్,ఎర్రం వినోద్, ప్రభాకర్,స్వరూప,అద్విక్ సాయి,సాయి అద్విత లు పాల్గొన్నారు.

RNI No. APTEL/2008/23088
తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా విజన్
Epaper.Telanganapatrika.in
బుధవారం
అక్టోబర్ 14, 2026
కరీంనగర్



# ఎస్సీ ఎస్టీ బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు






**జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

**జిల్లాలో ఈ ఏడాది 79 అట్రాసిటీ కేసులు నమోదు**

**బాధితులకు రూ.6.90 కోట్ల పరిహారం చెల్లింపు**

**గ్రామస్థాయిలో పౌర హక్కుల దినోత్సవం**

**నిర్వహణకు చర్యలు తీసుకోవాలి**

**జిల్లా స్థాయి విజిలెన్స్ మరియు మానిటరింగ్**

**కమిటీ సమావేశం నిర్వహణ**

**జగిత్యాల, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** ఎస్సీ ఎస్టీల పై అఘాయిత్యాల నిరోధక చట్టం అమలులో భాగంగా బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాల నిరోధక చట్టం (సవరణ)–2015, పౌర హక్కుల పరిరక్షణ చట్టం –1955 అమలుపై జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) లోని కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 79 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 20 కేసులు నిరూపితమయ్యాయని మిగిలిన కేసులు న్యాయ స్థానాల పరిధిలో ఉన్నాయని వివరించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో కలెక్టరేట్ స్థాయిలో ఎలాంటి ప్రతిపాదనలు పెండింగ్‌లో లేవని తెలిపారు. జిల్లాలో మొత్తం రూ. 7.60 కోట్ల పరిహారానికి గాను ఇప్పటి వరకు రూ. 6.90 కోట్లు చెల్లించామని మిగిలిన రూ. 79 లక్షలు ప్రభుత్వ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీల హక్కుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి నెల గ్రామ స్థాయిలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జనన మరణ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో పొందేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆలస్యంగా ధ్రువీకరణ పత్రాలు పొందడం వల్ల ఎదురయ్యే సమస్యలను వివరించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులకు సకాలంలో పత్రాలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ బాధితులకు న్యాయం అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చట్ట నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన బాధితులు ఫిర్యాదుల కోసం పోలీస్ స్టేషన్లకు వచ్చినప్పుడు అధికారులు సానుకూలంగా స్పందించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. దసరా పండుగ సందర్భంగా జిల్లాలోని ప్రతి గ్రామ అభివృద్ధి కమిటీకి కుల వివక్షకు తావులేకుండ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. పండుగ వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు సమానంగా పాల్గొనేలా చూడాలని గ్రామాల్లో సామాజిక సామరస్యం సమానత్వ భావనలను పెంపొందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి బాధితులకు పరిహారం చెల్లింపు కుల ధ్రువీకరణ పత్రాల జారీ పౌర హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ చట్టాల అమలును పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆర్డీవోలు సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జూర్కి రమేష్ పటేల్



**రాజేంద్రనగర్ ప్రతినిధి అక్టోబర్ 13 తెలంగాణ పత్రిక:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పిల్లోని గూడ గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జూర్కి రమేష్ పటేల్ రాజేంద్రనగర్ శాసనసభ సభ్యుడు ప్రకాష్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి ప్రసాదం ఇచ్చి కంకణం కట్టారు. సందర్భంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే జూరికి రమేష్ పటేల్ తో ముచ్చటించారు . పిల్లోని గూడ గ్రామ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

## 15న కామారెడ్డి జిల్లాలో జాబ్ మేళ

**జిల్లా ఉపాధి కల్పన అధికారి కిరణ్ కుమార్**



**కామారెడ్డి, అక్టోబర్ 13 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ 15 (గురువారం) నా రోజున ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో గల రూమ్ నెంబర్ 121, జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం, కామారెడ్డి నందు ఈ జాబ్ మేళా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో మైక్రోసాఫ్ట్వేర్ ఫైనాన్స్ కామారెడ్డి సంస్థలో ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

**ఖాళీల వివరాలు:** చేరియాల్ బ్రాంచ్ 10, రామాయంపేట బ్రాంచ్ 10, మాచారెడ్డి బ్రాంచ్ 5

**పోస్టు:** ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ (లోన్ డిస్బర్స్‌మెంట్ & కలెక్షన్)

**విద్యార్హత:** 10వ తరగతి నుండి ఏదైనా డిగ్రీ వరకు

**వయస్సు:** 18 నుండి 30 సంవత్సరాలు

**జీతం:** నెలకు రూ. 15,000/- ఇన్సెంటివ్స్

**ఇతర సౌకర్యాలు:** పెట్రోల్ అలవెన్స్, వసతి మరియు భోజన సదుపాయం

నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు 2 సెట్ల బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు మరియు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 8985612908, 6305743423 లా లో సంప్రదించవచ్చునని ఆయన వివరించారు.

## ఎల్టిఆర్ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి

**జీఎస్పీ తుడందెబ్బ నాయకుల డిమాండ్**

**1/70 చట్టానికి విరుద్ధంగా వలస గిరిజనేతరుల ఇంటి పన్ను రద్దు చేయాలి**

**వలస గిరిజనేతరులను ప్రోత్సహిస్తున్న పంచాయతీ అధికారులు**




**వెంకటాపురం. (నూగురు) అక్టోబర్ 13: తెలంగాణ పత్రిక:** ఎల్టిఆర్ చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరుల అక్రమ బహుళ అంతస్తులకు పంచాయతీ అధికారుల అండగా నిలుస్తున్నారని గొండ్వానా సంక్షేమ పరిషత్,తుడుందెబ్బ నాయకులు ఆరోపించారు. మంగళవారం గోండ్వానా సంక్షేమ పరిషత్ తుడుం దెబ్బ ఆధ్వర్యంలో వెంకటాపురం మండల కేంద్రంలో ఎల్ టి ఆర్ 1/70 చట్టానికి విరుద్ధంగా వలస గిరిజనేతరుల బహుళ అంతస్తుల నిర్మాణాలకు అధికారులే అండగా నిలుస్తున్నారని,వాటికి ఇచ్చిన ఇంటి పన్ను తక్షణమే రద్దు చేయాలని,వెంకటాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి, దొర. తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కణితి వెంకటకృష్ణ మాట్లాడుతూ. 5వ షెడ్యూల్ భూభాగంలో వెంకటాపురం మండల కేంద్రంలో ఎల్టిఆర్ 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులకు ఇంటి పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను గిరిజనేతరులు దౌర్జన్యంగా ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే పంచాయతీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని ఇలాంటి అధికారులు ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ఏం తోడ్పడతారు అని తేల్చి చెప్పాలన్నారు. 5వ షెడ్యూల్ భూభాగంలో కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు పటిష్టంగా అమలు చేయాలని,అమలు చేయని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంకటాపురం మండల కేంద్రంలో ఒక ఆదివాసి కుటుంబ 20 సంవత్సరాలుగా నివాసం ఉంటుంటే ఇంటి పన్నులు ఇవ్వకుండా,వెంకటాపురం పంచాయతీ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తూ వాళ్లని కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని మండిపడ్డారు. ఇంటి పన్ను ఇవ్వకుండా వారికి విద్యుత్ సౌకర్యం ఆరు నెలలుగా లేకుండా చిమ్మ చీకట్లో వారు నివసిస్తున్నప్పటికీ అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడం ఇది చాలా దారుణమని, 80 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఇంకా దొరల పాలన నడుస్తుందా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ సమాజానికి ప్రభుత్వ అండగా ఉండాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన వెంకటాపురం మండలంలోకి వలస గిరిజనేతరులు విచ్చలవిడిగా వస్తున్న, అధికారులు వలస గిరిజనేతరులను ప్రోత్సహిస్తున్నారు తప్ప,వలస నిరోధిక చట్టం ఏమాత్రం అమలు చేయడం లేదని మండిపడ్డారు. గిరిజనేతరుల అక్రమ ఇంటి పన్ను రసీదులను తక్షణమే రద్దు చేసి, ఎల్ టి ఆర్ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి ఎల్టి ఆర్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలపడం జరిగింది.

## బతుకమ్మ సంబరాలను ఎ ఘనంగా నిర్వహించాలి

**పర్యాటక అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**

**రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్**




**కామారెడ్డి, అక్టోబర్ 13, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ప్రజల భాగస్వామ్యంతో జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో బతుకమ్మ వేడుకల నిర్వహణ, పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిపై ఆమె పలు సూచనలు చేశారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించడంతోపాటు, వేడుకలకు సంబంధించిన చిత్రాలు, దృశ్యాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని వాణీ ప్రసాద్ సూచించారు. బతుకమ్మ పాటల ద్వారా సూపర్ ఎల్‌నినో ప్రభావాలు, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలకు మంజూరైన 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా అప్పగించాలని సూచించారు. పాక్షికంగా పూర్తయిన హరిత హోటళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో పెట్టుబడులను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, నిధుల సమీకరణ, పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి మరియు జిల్లా పర్యాటక అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, విద్యాసాగర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎండి సోయల్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

**ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని కార్యక్రమం**



**బొంరాస్‌పేట్ (అక్టోబర్ 13) తెలంగాణ పత్రిక:** ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా బూత్ నంబర్ 190 పరిధిలో ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులను సన్మానించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో, గ్రామాల పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి గౌరవించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. బూత్ నంబర్ 190 అధ్యక్షురాలు బి. లత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, నిర్వహణపై నాయకులు చర్చించారు. ఈ నెల 15వ తేదీన జరగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు జరుపుతున్నారు. ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ సమాజంలోని వివిధ వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న సేవకులను గుర్తించి సత్కరించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా ఉంది. ముఖ్యంగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో నిరంతరం కృషి చేస్తున్న ఆశా వర్కర్లు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సన్మానించడం ద్వారా వారి సేవలకు తగిన గుర్తింపు కల్పించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవ ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సేవకులను గౌరవించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజలకు సేవలందించే వారిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజంలో సేవాభావాన్ని మరింత విస్తరించవచ్చనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు బాబయ్య నాయుడు, సీనియర్ నాయకులు ఉప్పు జగదీశ్వర్, నాగురావు, ముకుందం, రాజారాం రెడ్డి, మహేందర్ గౌడ్, రాజు నాయక్ తదితరులు పాల్గొని కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికుల సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సేవా సంకల్ప అభియాన్ ద్వారా ప్రజలకు సేవలందించే వ్యక్తులను గౌరవిస్తూ, వారి కృషిని సమాజానికి తెలియజేసేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.

## మాజీ స్పీకర్ మధుసూదనాచారికి జన్మదిన వేడుకలకు హాజరైన తెలంగాణ ఉద్యమకారులు

**పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన ఉద్యమకారులు**



**ఆత్మకూర్, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభ స్పీకర్, తెలంగాణ ఉద్యమ నాయకుడు సిరికొండ మధుసూదనాచారికి తెలంగాణ ఉద్యమకారులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాదులో మంగళవారం తెలంగాణ ఉద్యమకారులు సమావేశమై మధుసూదనాచారి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పుష్పగుచ్ఛం సమర్పించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో నాయకులు, కార్యకర్తలు చేసిన పోరాటాలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా ఉద్యమకారులు పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమ నాయకుల పాత్ర ఎంతో కీలకమైందని, తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లో బలంగా వినిపించడంలో మధుసూదనాచారి వంటి నాయకులు విశేష కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభ స్పీకర్‌గా మధుసూదనాచారి అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ఇరుసడ్ల సదానందం ,బూబుమియా,( చిరు), సాగర్, తదితరులు పాల్గొన్నారు.



## పశువైద్య రంగంలో డా: సి. కృష్ణారావు స్మారక ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్న డా: మనీషా పటేల్

**ఉత్తమ పశువైద్యురాలికి అవార్డు ప్రదానం**



**జగిత్యాల, అక్టోబర్ 13 (తెలంగాణ పత్రిక):** తెలంగాణ రాష్ట్ర పశువైద్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న జగిత్యాల జిల్లాకు చెందిన పశు వైద్యాధికారిణి డా: కె. మనీషా పటేల్‌కు ప్రతిష్ఠాత్మకమైన డా: సి. కృష్ణారావు స్మారక ఉత్తమ పశువైద్యురాలిగా పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని శాంతినగర్ వెట్స్ హోమ్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా మనీషా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. పశు వైద్య సేవలకు గుర్తింపుగా పురస్కారం డా: కొమ్మెర మనీషా పటేల్ ప్రస్తుతం జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని మాదాపూర్ ప్రాథమిక పశువైద్య కేంద్రంలో సహాయ శస్త్ర చికిత్స అదికారిణినిగా విధులు నిర్వహిస్తున్నారు. అదనంగా చౌలమద్ది పశువైద్య కేంద్రం బాధ్యతలను కూడా నిర్వర్తిస్తున్నారు. పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించడం పశువ్యాధుల నియంత్రణ టీకా కార్యక్రమాల నిర్వహణ పశుపోషకుల సంక్షేమం గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద అభివృద్ధికి ఆమె చేస్తున్న విశిష్ట కృషిని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డా: మనీషా పటేల్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత అంకిత భావంతో పశువైద్య సేవలు అందిస్తూ పశుపోషకుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. తన విజయానికి సహకరించిన కుటుంబ సభ్యులు పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు సహచర వైద్యులు సిబ్బంది పశుపోషకులు ప్రజాప్రతినిధులు ప్రజలు పాత్రికేయులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## భారీగా హరిత ఇంధనం కొనుగోలు

**విద్యుత్‌శాఖ ప్రకటన**

**హైదరాబాద్ :** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు భారీగా హరిత ఇంధనం కొనుగోలు కార్యక్రమాన్ని చేపట్టినట్లు విద్యుత్‌శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో), తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (టీజీ జెన్‌కో) ఆధ్వర్యంలో వివిధ రకాల విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించిన టెండర్లను పిలుస్తున్నట్లు పేర్కొంది. ఇందులో 3,000 మెగావాట్ల సౌర విద్యుత్తుతో పాటు 6,000 మెగావాట్ గంటల బ్యాటరీ విద్యుత్తు నిల్వ వ్యవస్థ, 800 మెగావాట్ల పవన విద్యుత్తు, 2,000 మెగావాట్ల రౌండ్ ది క్లాక్ (ఆర్ఈ–ఆర్టీసీ) కరెంటు, మరో 2,000 మెగావాట్ గంటల బ్యాటరీ నిల్వ వ్యవస్థలు ఉన్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ప్రైవేటు సంస్థలే ప్రాజెక్టుల అభివృద్ధి, ఆర్థిక సమీకరణ, యాజమాన్యం, నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నాయి. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం నేరుగా మూలధన పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేకుండానే విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని పేర్కొంది.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి మరో పురస్కారం

కూరెల్లి శ్రీనివాసరెడ్డికి గురువందనం అవార్డు




**నంగునూరు, అక్టోబరు 13(తెలంగాణ పత్రిక):** సిద్ధిపేట జిల్లా కుకునూరు పల్లి మండలం కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కూరెల్లి శ్రీనివాసరెడ్డికి మరో గౌరవం దక్కింది. జీ తెలుగు న్యూస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన గురువందనం కాంక్లేవ్‌లో ఆయన గురువందనం అవార్డును అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులకు ఈ సందర్భంగా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్, మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ కె.కేశవరావు, శాసనమండలి సభ్యుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి హాజరయ్యారు. జీ తెలుగు న్యూస్ చీఫ్ ఎడిటర్ భరత్‌కుమార్, పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి, అధికార ప్రతినిధి వంగ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రస్థాయి అవార్డు తర్వాత మరో గుర్తింపు**

కూరెల్లి శ్రీనివాసరెడ్డి గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. తాజాగా గురువందనం అవార్డుకు ఎంపిక కావడంతో ఆయనకు మరో గుర్తింపు లభించినట్లయింది. ఒకే ఉపాధ్యాయుడికి రాష్ట్ర స్థాయి పురస్కారంతో పాటు మరో ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కడం విశేషం.

**పలువురి అభినందనలు**

శ్రీనివాసరెడ్డికి గురువందనం అవార్డు లభించడంతో పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధరశర్మ, కుకునూరుపల్లి మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య, కొండపాక మండల విద్యాధికారి పురుమాండ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు. ఆయన సాధించిన గుర్తింపు ఉపాధ్యాయ వర్గాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## ఆడపిల్లలపై, యువకులపై, మేధావులపై ,అడ్వకేట్ల పైన, పత్రిక విలేకరుల పైన బిజెపి ఆర్ఎస్ఎస్ బజరంగధల్ గుండాలు పోలీసులు విచక్షణ లేని దాడులకు పూనుకోవడం సిగ్గుచేటు

బిజెపి గెలుపు కోసమే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పనిచేస్తున్నారు

సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్




**కామారెడ్డి, అక్టోబర్ 13,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి):** భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించే ఓటు హక్కును ఎస్ ఐ ఆర్ పేరుతో తొలగించడం రాజ్యాంగ ఉల్లంఘున కిందికి వస్తుందని తొలగించిన 13 కోట్ల ఓట్లను తిరిగి చేర్చాలని దీనికి కారణమైన ఎలక్షన్ చీఫ్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే పదవిలో నుండి వైదొలగాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి యువజన ప్రజా సంఘాలు కాక్రోచ్ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీ నాయకులు చేస్తున్న ఆందోళనలపై పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించి అరెస్టు చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కుల పైన దాడి చేయడమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు ఎన్నికల కమిషనర్ బిజెపి గెలుపు కోసం ఓట్లు తొలగింపును చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ధర్నాని విచ్చిన్నం చేయడానికి ఢిల్లీ నగరంలో 50 వేల మంది పారా మిలటరీ పోలీస్ యంత్రాంగంతో దిగ్బంధనం చేశారని 58 మెట్రో రైల్వే స్టేషన్లను మూసివేసారని, బయట నుండి వస్తున్న రైళ్ల రాకపోకలను చేసి ప్రజా రవాణాకు ఆటంకం కల్పించడం చూస్తే మోడీ ప్రభుత్వం మరో ఎమర్జెన్సీ పాలనను తలపించేలా చేశారని అన్నారు బిజెపి నయా ఫాసిస్ట్ విధానాలను ముక్తకంఠంతో దేశమంతా ఖండిస్తున్నదని ఓటు హక్కు కోసం అడుగుతున్న విద్యార్థి యువజన మేధావులను విచక్షణారహితంగా ప్రైవేట్ ఆర్ఎస్ఎస్ వీహెచ్పీ గుండాలతో భౌతిక దాడులకు పాల్పడడం దుర్మార్గమైనదని చెప్పారు నేమ్ ప్లేట్ లేని పోలీస్ డ్రెస్సులను వేసుకున్న వారు ఆడపిల్లలు అని కూడా చూడకుండా బట్టల చింపడం కిడ్నాప్ చేయడం ప్రైవేటు వాహనాలలో బంధించి వేధించడం కాక్రోచ్ జనతా పార్టీ అధినేతను ఫ్లైట్లోనే నిర్బంధించడం మీడియా మహిళలపై దాడులకు పూనుకోవడం ఇంటర్నెట్ ఫోన్ సౌకర్యాన్ని బ్లాక్ చేయడం సిపిఎం ప్రజా ప్రతినిధులను విచక్షణ రహితంగా కొట్టడం పార్టీ ఆఫీసుల మీద మూకుమ్మడి దాడులు చేసి నాయకులను కార్యకర్తలను అరెస్టు చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు ఆర్టికల్ 19 ప్రకారం ప్రతి పౌరుడు నిరసనను తెలియజేసే హక్కు ఉందని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై ఎలాంటి నిర్బంధాన్ని ప్రయోగించిన వారందరిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను విధులలో నుండి తప్పించాలని దాడులకు బాధ్యులైన వారందరినీ ఉద్యోగాల నుండి తీసివేయాలని డిమాండ్ చేస్తున్నాం సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు వెంకట్ గౌడ్, మోతి రామ్ నాయక్ ,కొత్త నరసింహులు, ముదం అరుణ్ కుమార్ ,రేణుక ,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల వినతి

**హైదరాబాద్ :** రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో సుమారు 1200 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, ఆ తర్వాతే కొత్త నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ కుమార్ లోధ్ మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, కార్యదర్శి శ్రీరాం వెంకటేష్‌లకు వినతిపత్రం అందజేశారు. గతంలో రాజస్థాన్ ప్రభుత్వం.. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించేలా చట్టం చేసిందని వారు గుర్తుచేశారు.

## ఐసీటీ టూల్స్‌పై టీచర్లకూ శిక్షణ

**హైదరాబాద్ :** జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) సహకారంతో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) టూల్స్‌పై డైట్, బీఈడీ కళాశాలల అధ్యాపకులతో పాటు టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. సాధారణంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ)లకు ఉన్నత విద్యా సంస్థల్లో పనిచేసే ఆచార్యులు, అధ్యాపకులను ఎంపిక చేస్తారు. అందుకు భిన్నంగా ఈ శిక్షణకు 11 మంది డైట్, ముగ్గురు బీఈడీ అధ్యాపకులతోపాటు ఆరుగురు టీచర్లను ఎంపిక చేయడం విశేషం. శిక్షణకు ఎంపికైన టీచర్లు గాజుల బాలకృష్ణ, షరీఫ్ అహ్మద్ (కరీంనగర్ జిల్లా), డి.కృష్ణారావు (ఖమ్మం), రామటెంకీ పుష్పలత (పెద్దపల్లి), అంజుమ్‌సుల్తానా (మహబూబాబాద్), జి.రథాంగపాణి రెడ్డి (మహబూబ్‌నగర్).

# అంతర్జాతీయ వేదికపై సిరిసిల్ల నేతన్న అద్భుత సృష్టి

- దుబాయ్ పాలక కుటుంబ చిత్రాలతో ప్రత్యేక చేనేత శాలువా ఆవిష్కరణ.!
- కేటీఆర్ దార్శనికతతోనే గ్లోబల్ బ్రాండ్‌గా సిరిసిల్ల చేనేత వైభవం
- ETCA 16వ బతుకమ్మ సంబరాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచిన సిరిసిల్ల హస్తకళా అద్భుతం.. కేటీఆర్ పై ప్రశంసల జల్లు.!
- తెలంగాణ గల్ఫ్ కార్మికుల పక్షాన దుబాయ్ రాజకుటుంబానికి అరుదైన చేనేత కానుక..!







**తెలంగాణ పత్రిక ప్రతినిధి, హైదరాబాద్**

తెలంగాణ చేనేత కళా వైభవానికి అంతర్జాతీయ వేదికపై మరో అరుదైన గౌరవం దక్కింది. దుబాయ్ వేదికగా జరిగిన ETCA 16వ బతుకమ్మ వేడుకల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ మగ్గంపై నూలు పోగులతో రూపొందించిన ప్రత్యేక శాలువాను ఘనంగా ఆవిష్కరించారు. దుబాయ్ పాలక కుటుంబ సభ్యుల చిత్రాలను అత్యంత ప్రతిభావంతంగా నేసిన ఈ అద్భుత శాలువా భారత-యూఏఈ దేశాల సాంస్కృతిక స్నేహబంధానికి ప్రతీకగా నిలిచింది. సిరిసిల్ల నేతన్నల అసాధారణ నైపుణ్యాన్ని, గల్ఫ్ దేశంలో స్థిరపడిన లక్షలాది మంది ప్రవాస తెలంగాణ గల్ఫ్ కార్మికుల పక్షాన అక్కడి పాలక వ్యవస్థ పట్ల తమకున్న కృతజ్ఞతా భావాన్ని మరియు గౌరవాన్ని చాటిచెప్పేలా ఈ అరుదైన కళాఖండాన్ని మలచడం విశేషం.

**కేటీఆర్ దార్శనికతతో ప్రపంచ పటంలో సిరిసిల్ల చేనేత!**

ఒకప్పుడు ఆకలి కేకలు, ఆత్మహత్యలతో వార్తల్లో నిలిచే సిరిసిల్ల చేనేత రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన విజనరీ లీడర్ కేటీఆర్ అని ప్రవాస తెలంగాణీయులు, గల్ఫ్ కార్మికులు కొనియాడారు. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో సిరిసిల్ల చేనేత రంగానికి ప్రాణం పోశారని, నేతన్నలకు నిరంతరం ఉపాధి కల్పించడంతో పాటు మగ్గాల ఆధునీకరణ, బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ఇచ్చి నేత కార్మికులను ఆదుకున్నారని గుర్తుచేసుకున్నారు. అంతేకాకుండా సిరిసిల్లలో తయారయ్యే అద్భుతమైన వస్త్రాలను అంతర్జాతీయ ప్రదర్శనల్లో నిలిపి, ప్రపంచ వేదికలపై సిరిసిల్ల నేతన్న ప్రతిభను చాటిచెప్పిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందని ప్రశంసల వర్షం కురిపించారు. కేటీఆర్ అందించిన నిరంతర ప్రోత్సాహం, సాంకేతిక సహకారంతోనే నేడు సిరిసిల్ల నేతన్నలు మగ్గంపై రాజకుటుంబీకుల చిత్రాలను సైతం అద్భుతంగా సృష్టించే స్థాయికి ఎదిగారని ప్రవాస సంఘాలు కొనియాడాయి.

**తెలంగాణ గల్ఫ్ కార్మికుల గౌరవ సూచిక.. మగ్గంపై అద్భుత చిత్రం!**

చేనేత రంగానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెస్తున్న సిరిసిల్ల నేత కార్మికులు తమ వినూత్న ప్రయోగాలతో నిరంతరం సంచలనాలు సృష్టిస్తున్నారు. ఈ క్రమంలోనే వెల్ది హరిప్రసాద్ మగ్గంపై దుబాయ్ రాజకుటుంబీకుల చిత్రాలను అత్యంత నిశితంగా, ఓర్పుతో నేసి తన ప్రతిభను చాటుకున్నారు. వస్త్రంపై ఇలాంటి చిత్రాలను నైపుణ్యంతో మలచడం అంతర్జాతీయ స్థాయిలో సిరిసిల్ల హస్తకళా వైభవాన్ని మరోస్థాయికి తీసుకెళ్లింది. గల్ఫ్ దేశాల్లో స్థిరపడి, తమ కష్టార్జితంతో కుటుంబాలను పోషించుకుంటూనే, తాము నివసిస్తున్న దేశ పాలకుల పట్ల గల్ఫ్ కార్మికులు కలిగి ఉన్న అమితమైన గౌరవాన్ని ఈ శాలువా ప్రతిబింబిస్తోంది.

**ప్రముఖుల సమక్షంలో ఘనంగా ఆవిష్కరణ!**

దుబాయ్‌లోని అల్ అహ్లీ స్పోర్ట్స్ క్లబ్‌లో నిర్వహించిన ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ (ETCA) బతుకమ్మ సంబరాల్లో ఈ శాలువాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులు, ETCA వ్యవస్థాపక అధ్యక్షుడు పిచ్చిర కిరణ్ కుమార్, అధ్యక్షుడు జగదీష్ రావులతో పాటు వేలాది మంది ప్రవాస భారతీయులు, గల్ఫ్ కార్మికులు పాల్గొన్నారు. బతుకమ్మ సంబరాలతో పాటు ఈ చేనేత శాలువా వేడుకల్లో ప్రధాన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**కళాకారుడికి అండగా నిలిచిన దాతలు!**

ఈ అరుదైన చేనేత శాలువా రూపకల్పనకు బాలు కాయితి, సిరిసిల్లకు చెందిన ప్రముఖ సివిల్ కాంట్రాక్టర్ జూపల్లి వెంకటరావు ఆర్థిక సహకారం అందించి అండగా నిలిచారు. గ్రామీణ ప్రాంతాల్లోని చేనేత కళాకారులకు సరైన ప్రోత్సాహం అందిస్తే వారు అంతర్జాతీయ వేదికలపై అద్భుతాలు సృష్టించగలరని, కేటీఆర్ వేసిన ప్రగతి బాటలో కళాకారులకు తోడ్పాటు అందించడం సంతోషంగా ఉందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**దుబాయ్ పాలకులకు బహుమతిగా అందించేందుకు ఏర్పాట్లు!**

గల్ఫ్ ప్రగతిలో భాగస్వాములవుతున్న తెలంగాణ గల్ఫ్ కార్మికుల అందరి తరఫున ఈ విశిష్ట కళాఖండాన్ని త్వరలోనే దుబాయ్ పాలక కుటుంబానికి అధికారికంగా బహుమతిగా అందజేయడానికి ETCA ప్రతినిధులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమం గల్ఫ్ కార్మికుల ఆత్మగౌరవాన్ని పెంచడమే కాకుండా, రెండు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయనుంది.

## పోస్టుమెట్రిక్ విద్యార్థులకు రూ.204.40 కోట్ల భరోసా

32,976మందికి స్కాలర్‌షిప్ నిధుల విడుదల

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఫీజు బకాయిలకు మరో రూ.14.68 కోట్లు



**హైదరాబాద్:** రాష్ట్రంలోని ఎస్సీ విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 32,976 మంది విద్యార్థులకు మొత్తం రూ.204.40 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన 40 శాతం వాటాగా రూ.101.44 కోట్లు, కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటాగా రూ.102.96 కోట్లు విడుదల చేసినట్లు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కళాశాలల నుంచి అందుతున్న పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అర్హత ఉన్న విద్యార్థులకు దశలవారీగా స్కాలర్‌షిప్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

**విద్యకు అత్యంత ప్రాధాన్యం**

ఆర్థిక పరిస్థితులు కారణంగా ఏ ఒక్క ఎస్సీ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్ ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ సహాయం అందేలా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

**హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు రూ.14.68 కోట్లు**

ఇదిలా ఉండగా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.14.68 కోట్లను విడుదల చేసింది. విద్యార్థుల విద్యకు సంబంధించిన ఫీజు బకాయిలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని మంత్రి అడ్లూరి తెలిపారు.

## రోగుల భద్రతకు పెద్దపీట వేయండి: ఎన్ఎంసీ

**హైదరాబాద్ :** వైద్య కళాశాలలు, వైద్య సంస్థలలో రోగుల భద్రతా విధానాలను మరింత బలోపేతం చేయాలని, ఈ క్రమంలో 'పేషెంట్ సేఫ్టీ కమిటీ' ఏర్పాటు చేసి రోగుల భద్రత కోసం నోడల్ అధికారిని నియమించాలని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) దేశవ్యాప్తంగా ఉన్న అన్ని బోధనాసుపత్రులను ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరోగ్య సేవలను మెరుగుపరచడం, చికిత్సకు అయ్యే అనవసర వ్యయాన్ని తగ్గించడం, రోగుల సంతృప్తిని పెంపొందించడం, ఆరోగ్య సంరక్షణ సేవలపై ప్రజల్లో నమ్మకాన్ని బలోపేతం చేయడం తమ ముఖ్య ఉద్దేశమని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఆసుపత్రుల్లో ఏటా సుమారు 52 లక్షల మంది రోగులకు ఆసుపత్రుల్లో చికిత్స లోపం, నిర్లక్ష్యం వల్ల గాయాలు అవుతున్నాయని, వీటిని గణనీయంగా తగ్గించడానికి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

## లడఖ్‌పై చైనాకు భారత్ గట్టి కౌంటర్



**న్యూఢిల్లీ:** లడఖ్ కేంద్రపాలిత ప్రాంతం భారతదేశంలో అంతర్భాగమని భారత విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేసింది. లడఖ్‌లోని 28 ప్రాంతాలు, భౌగోళిక అంశాలకు అధికారిక పేర్లు గుర్తించడంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేయగా దానిపై భారత్ దీటుగా స్పందించింది. లడఖ్ భారత్‌లో విడదీయలేని భాగమని, చైనా ఎంతగా నిరాకరించినా ఈ వాస్తవం మారదని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఈ అంశంపై కేంద్ర హోం శాఖ చేసిన ప్రకటన కూడా స్పష్టంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

## మాదక ద్రవ్య రహిత సమాజం నిర్మించాలి: దానకిశోర్

**హైదరాబాద్ :** యువతలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించి, మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర ఛైర్మన్ దానకిశోర్ అన్నారు. మంగళవారం అన్ని జిల్లాల రెడ్‌క్రాస్ శాఖ కార్యవర్గ సభ్యులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని గవర్నర్ శివప్రతాప్ శుక్లా త్వరలో ప్రారంభించనున్నారని, దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా క్షయవ్యాధి బాధితులకు వైద్య చికిత్సతోపాటు పౌష్టికాహారం అందించడంపై దృష్టిసారించాలని సూచించారు.

## దిల్లీలో పోలీసుల తీరు సరికాదు: ఎఫ్‌సీడీ

**హైదరాబాద్ :** దేశ రాజధాని దిల్లీలో నిరసనకారులపై పోలీసులు ప్రవర్తించిన తీరును ది ఫోరం ఫర్ కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రసీ (ఎఫ్‌సీడీ) తీవ్రంగా ఖండించింది. మహిళా కార్యకర్తలు, నిరసనకారులు, విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులను చట్టవిరుద్ధంగా అదుపులోకి తీసుకోవడంతో పాటు వారిపట్ల ప్రవర్తించిన విధానాన్ని ఎఫ్‌సీడీ మంగళవారం ఒక ప్రకటనలో తప్పుబట్టింది. 'ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న వారిపై ఆంక్షలు విధించడం, బలగాలను ప్రయోగించిన తీరు సరికాదు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్నవారిని, విధులు నిర్వహిస్తున్న పాత్రికేయులను పోలీసులు లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై జరిగిన తీవ్రమైన దాడి. నిరసనలకు ఆటంకం కలిగించొద్దని సుప్రీంకోర్టు ఆదివారం ఆదేశాలు జారీ చేసినప్పటికీ పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరం' అని ఎఫ్‌సీడీ కన్వీనర్ కె.రామచంద్ర మూర్తి పేర్కొన్నారు.

## హరీశ్.. ముందు మీ ఎమ్మెల్యే పదవి కాపాడుకోండి: విప్ బీర్ల

**హైదరాబాద్ :** కేసీఆర్‌ను సీఎం చేయడం పక్కన పెట్టి ముందు మీ ఎమ్మెల్యే పదవిని కాపాడుకోండి అని భారాస ఎల్పీ ఉపనేత హరీశ్‌రావుకు..ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హితవు పలికారు. సిద్దిపేట సభలో హరీశ్‌రావు రాష్ట్రప్రభుత్వంపై చేసిన విమర్శలను మంగళవారం ఆయనొక ప్రకటనలో ఖండించారు. 'మా సీఎం సిరిసిల్లలో సభ పెట్టి స్టార్ హోటళ్ల బండారం బయటపెడితే కేటీఆర్ ముఖం చూపించలేకపోయారు. త్వరలో సిద్దిపేట, గజ్వేల్‌లో కూడా మీ కథ ముగించేందుకు రేవంత్‌రెడ్డి రాబోతున్నారు. కేసీఆర్‌ను అడ్డుపెట్టుకొని మీరు చేసిన అవినీతి, అక్రమాలు, వ్యాపారాలన్నీ బయటపెట్టి ప్రజలే మిమ్మల్ని తరిమికొట్టేలా చేస్తారు. ఎల్‌నినోతో కరవు వస్తే ప్రభుత్వంపై నెపం నెట్టి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. మీరెన్ని చెప్పినా రాష్ట్ర ప్రజలకు వాస్తవాలేంటో తెలుసు' అని పేర్కొన్నారు.

## మలికా హండాకు కేటీఆర్ అభినందనలు

**హైదరాబాద్ :** ఆసియా పసిఫిక్ డెఫ్ మల్టీ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్–2026లో కాంస్య పతకం సాధించిన మలికా హండాకు భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అభినందనలు తెలిపారు. 2022 జనవరిలో మలికా ప్రతిభను గుర్తించిన కేటీఆర్ ఆమెకు రూ.15 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. భవిష్యత్తులో ఛాంపియన్‌షిప్‌లకు సిద్ధమయ్యేందుకు ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. ఇప్పుడు ఆమె అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించడంపై కేటీఆర్ ఆనందం వ్యక్తం చేశారు.

Editor, Printer, Publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1, Auto Nagar, village Bommakal, Mdl and District: Karimnagar - 500001. Telangana State, Published at H. NO. 9-10/7A Krishna Nagar, Bommakal Village Mdl and District Karimnagar 505001, Telangana State, Editor : B. VENKATESHAM Cell : 8341110143